RNI: TEL TEL /2019/12836

# అభ్యుదయం

The Pride of Telugu national daily



Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో నియోజక వర్గాల వారిగా విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263

పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ   శనివారం 15-8- 2026   సంపుటి : 6   సంచిక : 186   ఎడిటర్ : ఆనంద్ రావు   పేజీలు : 8  వెల : 3-00

## ఏపీలో ప్రతి రోజూ 7000 టన్నుల చెత్త



మున్సిపాలిటీల్లో చెత్త తొలగింపునకు కృషి
పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడి

## రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు



- పార్టీ వేదికల్లో మాత్రమే చెప్పాలి
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

# చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు

## విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన



మిగతా 2లో

- నర్సరీ నుంచి బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు అన్ని సదుపాయాలు
- కులరహితంగా అందరికీ ఒకే విద్యకోసం కృషి
- గత ప్రభుత్వం కుల విద్యల పేరుతో విద్యకు దూరం చేసింది
- పూలే దంపతుల విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్

హైదరాబాద్,**అభ్యుదయం**

చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు లభిస్తాయని, విద్య ఒక్కటే తలరాతలను మార్చే మార్గమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 150 ఏళ్ల క్రితమే జ్యోతిబా పూలే చదువే ఏకైక మార్గమని చాటిచెప్పారని, తాను చదువుకోవడంతో పాటు తన సతీమణి సావిత్రిబాయి పూలేను చదివించి ఆదర్శంగా నిలిచారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. శుక్రవారం నెక్లెస్ రోడ్డులో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒకవైపు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మరోవైపు ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, జ్యోతిబా పూలే విగ్రహాలను ఆవిష్కరించుకోవడం గర్వకారణమని రేవంత్ పేర్కొన్నారు. నెక్లెస్ రోడ్ చౌరస్తా ఇప్పుడు అద్భుతంగా మారిందని చెప్పారు. ఇంతకాలం తర్వాత కూడా పూలేను ఆదర్శ పురుషుడిగా గుర్తిస్తున్నామంటే ఆయన ఆలోచనల గొప్పతనం అర్థమవుతోందని సీఎం అన్నారు. తమ ప్రభుత్వం జ్యోతిబా పూలే

## నేడు రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

ఎవరి భూమి ఎక్కడికీ పోదు.. ఆందోళన వద్దు
క్యూర్ పరిధిలో ఈవీలుగా ఆటోల మార్పు
ఆటోకు రూ.లక్షన్నర సబ్సిడీ.. 200 కోట్లతో పథకం
ఏడు రకాల సన్నవడ్లకు రూ.500 బోనస్ చెల్లింపు
హెల్త్ పాలసీ దరఖాస్తులకు మరో 3 నెలల గడువు




హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వివాదాల్లేని ఆస్తులు/భూములు నిషేధిత జాబితా (22ఏ)లో ఉంటే.. వాటిని యుద్ధప్రాతిపదికన తొలగించాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు, రిజిస్ట్రార్‌లకు ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

2లో

## పోలవరం సివిల్ వర్క్స్ 90 శాతం పూర్తయ్యాయి

- వెలిగొండ నిర్వాసితులకు నెలాఖరులోగా 600కోట్లు ఇస్తాం
- విశాఖలో డేటాసెంటర్లకు 3 టిఎంసిల గోదావరి జలాలు
- 36 ప్రాజెక్టుల నెలవారీ వర్క్ ప్రోగ్రెస్ ఇవ్వాలని సిఎం ఆదేశించారు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు



2లో

# డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

- ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సమ్మిట్‌కు ప్లాన్
- క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు
- ఘనంగా నేటి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం
- క్యూర్ పరిధిలో ఆటోలను ఇవిలుగా మార్చేందుకు పథకం
- స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు
- ఏడు రకాల సన్నాల సాగుకు ప్రోత్సాహం..ప్రచారం
- మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతలకు రూ. 2,100 కోట్ల అంచనా
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం

మిగతా 2లో

హైదరాబాద్ **అభ్యుదయం**

:రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాబోయే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్‌ను గతేడాది కంటే మరింత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈసారి ప్రత్యేకంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ' అనే థీమ్‌తో ఈ సమ్మిట్‌ను ప్లాన్ చేస్తున్నారు. అంతేకాకుండా, తెలం గాణలో ఇప్పటివరకు స్టార్టప్‌లు సాధించిన విజయాలు, సాధించిన పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పేలా సమ్మిట్ ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది.

మిగతా 2లో



# బావమరిది మృతికి కెసిఆర్ సంతాపం

## భౌతికి కాయం వద్ద నివాళులు





హైదరాబాద్, **అభ్యుదయం** అనారోగ్యంతో మరణించిన తన బావమరిది జోగినపల్లి శ్రీనివాస్ రావు పార్థివ దేహానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళులర్పించారు. ఎర్రవల్లి నుంచి నేరుగా సుచిత్రలోని శ్రీనివాస్‌రావు నివాసానికి చేరుకున్న కేసీఆర్ నివాళులు అర్పించిన అనంతరం శోకతప్తులైన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధైర్య పడొద్దు అండగా ఉంటామన్నారు. ఆయన వెంట కేటీఆర్, హరీశ్ రావు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

కాగా, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సికింద్రాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న ఆయన, గురువారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు.

## అగ్నిమాపక శాఖకు అధునాతన వాహనాలు

-రూ.40 కోట్లతో 58 ఫైర్ ఫైటింగ్ వాహనాలు
-ముఖ్యమంత్రి చంద్రబాబు

- మిగతా 2లో పేజిలో



# పోలవరం సివిల్ వర్క్స్ 90 శాతం పూర్తయ్యాయి

అమరావతి, భీమోదయం: పోలవరం, వెలిగొండ ప్రాజెక్టు లతో పాటు మొత్తం 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులు, ఐడిసి లిఫ్ట్ స్కీం, వంటి అంశాలతో పాటు, ఎల్ నినో వంటి సందర్భంలో త్రాగునీటి అవసరాల నిమిత్తం ఏ రకంగా ప్రణాళిక తీసుకుంటున్నాం అనే అంశాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్షా సమావేశంలో చర్చించడం జరిగిందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అమరావతి సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ
పోలవరం ప్రాజెక్టు సివిల్ వర్క్స్ 90% పూర్తయ్యాయని, భూసేకరణ 94% పూర్తిచేశామని,అదేవిధంగా ఆర్ అండ్ ఆర్ నిర్వాసితులకు తరలింపు 52% పూర్తయిందని, ఇలా మొత్తం పోలవరం ప్రాజెక్టు ఇప్పటి వరకు 77% పూర్తి చేయడం జరిగిందని స్పష్టం చేశారు. మిగిలిన బ్యాలెన్స్ పనులు కూడా త్వరితగతిన, అంటే ఇచ్చినటువంటి షెడ్యూల్ ప్రకారమే పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అందులో ముఖ్యంగా ఆర్ అండ్ ఆర్, అదేవిధంగా భూసేకరణకు సంబంధించి, కాలనీలకు సంబంధించిన పనులు డిసెంబర్ నాటికి పూర్తయ్యే విధంగా అంటే ప్రాజెక్టును ప్రారంభించడానికి ఆరు నెలలు ముందుగానే ఒక షెడ్యూల్ ని కూడా రూపొందించుకుని, ఆ షెడ్యూల్ ప్రకారం ఆర్ అండ్ ఆర్, భూసేకరణ, కాలనీలు పూర్తి కావాలని సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారని తెలిపారు.

అదేవిధంగా పోలవరం అనేది ఒక ఇరిగేషన్ ప్రాజెక్టుగానే కాదు, భవిష్యత్తులో ఒక టూరిజం హబ్ గా కూడా చేసేవిధంగా 10,000 ఎకరాలతో రేడియల్ సర్వే చేసి, అభివృద్ధి చేయడంతో పాటు, పోలవరం స్పిల్ వే కి సంబంధించి బ్యూటిఫికేషన్, అదేవిధంగా కనెక్టివిటీ బ్రిడ్జ్ ని కూడా ఐకానిక్ మోడల్ లో తయారు చేసుకోవడం, హైవేస్ కనెక్టివిటీ గాని, పోలవరం ప్రాజెక్ట్ నుంచి భద్రాచలం వరకు కూడా రివర్ బేస్డ్ టూరిజాన్ని అభివృద్ధి వంటి అంశాలపై చర్చించడం జరిగిందన్నారు.

## అగ్నిమాపక శాఖకు అధునాతన వాహనాలు

అమరావతి, అగ్నిప్రమాదాలు, విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడేందుకు అగ్నిమాపకశాఖను మరింత ఆధునికంగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేసిన సుమారు రూ.40 కోట్ల విలువైన 58 అగ్నిమాపక వాహనాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రోడ్డులో ఫైర్ సేఫ్టీ వాహనాలకు సీఎం జెండా ఊపారు. అగ్నిమాపక శాఖ అధికారులు ఆ వాహనాల ప్రత్యేకతలను సీఎంకు వివరించారు. అలాగే గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులకు ఉపయోగపడేలా ప్రమాద ప్రాంతాలకు వేగంగా చేరుకుని తక్షణమే అగ్నిమాపక సేవలు అందించేలా రూ.18.68 కోట్ల విలువైన 25 అధునాతన అగ్నిమాపక వాహనాలు అందుబాటులోకి వచ్చాయని అధికారులు తెలిపారు. పెద్ద అగ్నిప్రమాదాల సమయంలో నిరంతర నీటి సరఫరాకు ఉపయోగపడేలా రూ.14.79 కోట్ల విలువైన 20 వాటర్ బౌజర్లను సిద్ధంగా ఉంచుకున్నామని సీఎంకు అధికారులు చెప్పారు. ఒక్కో వాటర్ బౌజర్ 14 వేల లీటర్ల నీటిని తరలించే సామర్థ్యం కలిగి ఉంటాయని... పట్టణ, పారిశ్రామిక ప్రాంతాల్లో మంటలను అదుపు చేయడంలో ఇవి కీలకంగా వ్యవహరిస్తాయని తెలిపారు. ఇరుకైన, రద్దీగా ఉండే ప్రాంతాల్లోనూ వేగంగా చేరుకునేలా రూ.6.37 కోట్ల విలువైన 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ ఫైర్ ఫైటింగ్ వాహనాలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించినట్టు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మొత్తం రూ.252.86 కోట్ల వ్యయంతో దశలవారీగా ఆధునిక వాహనాలు, పరికరాలను సమకూరుస్తున్నాం. తొలిదశలో రూ.33 కోట్ల వ్యయంతో 65 అగ్నిమాపక వాహనాలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చాం. రెండో దశలో రూ.40 కోట్లతో 58 వాహనాలను ఇప్పుడే ప్రారంభించుకున్నాం. ఇక త్వరలో మూడో దశలోనూ మరిన్ని అగ్నిమాపక వాహనాలు, ఫైర్ ఫైటింగ్ పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నాం. వీటితో పాటు ఫైర్ స్టేషన్లల్లో మౌలిక వసతులపైనా ప్రత్యేక దృష్టి సారించాం. రాష్ట్రంలో 17 కొత్త ఫైర్ స్టేషన్ భవనాల నిర్మాణం జరుగుతుండగా, ఒక్కో భవనానికి రూ.2.25 కోట్ల చొప్పున ఖర్చు పెడుతున్నాం. వీటిలో ఆరు భవనాల నిర్మాణం పూర్తయింది. మరో 36 ఫైర్ స్టేషన్లను ఆధునీకరిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా అగ్నిమాపక సేవల మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నాం అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి అనిత, అగ్నిమాపక శాఖ డీజీ వెంకటరమణ సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు



హైదరాబాద్,ఆగస్ట్14కాంగ్రెస్ పార్టీలో సీఎం సహా ఎవరికైనా ఒకటే గౌరవం ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి కూడా అదే గౌరవం ఇస్తున్నామని చెప్పారు. రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మహేశ్‌కుమార్‌గౌడ్ స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. 'కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవేదన, ఆందోళనను అర్థం చేసుకుంటాం. పార్టీకి సంబంధించి నాలుగు గోడల మధ్య చర్చించాల్సిన అంశాలను బహిరంగంగా మాట్లాడకూడదని హితవు పలికారు. రాజగోపాల్‌రెడ్డి ప్రజా నాయకుడు.. నాకు మంచి మిత్రుడు. గీత దాటి మాట్లాడకూడదు.. ఆయన అలా మాట్లాడటం సరికాదు. సమయం వచ్చినప్పుడు అవకాశాలు ఉంటాయి. ఏం మాట్లాడినా అధిష్ఠానం దృష్టికి వెళుుంది. బిల్లుల విషయంలో ఒక క్రమపద్ధతిలో ముందుకెళ్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం మాదిరిగా మేం చేయట్లేదని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమానికి, కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేనివాళ్లు ప్రభుత్వంలో అధికారాన్ని అనుభవిస్తున్నారంటూ రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు.

# డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ముగిసింది. ఈ కేబినెట్ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి మీడియాకు వివరించారు. ఎంపి రఘురామిరెడ్డి కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్, గ్రేటర్ పరిధిలోని సిటిజన్స్ అర్బన్ రీస్ట్రక్చరింగ్ అండ్ ఎకానమీ ప్రాజెక్ట్ పరిధిలో నిర్మించతలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అర్హులైన పేద, మధ్యతరగతి వర్గాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించింది. ఇకపోతే గ్లోబల్ సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను కేబినెట్ ఏర్పాటు చేయనుంది. గత ఏడాది కంటే ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనుంది. ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ప్రజలకు వివరించనుంది. తెలంగాణలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మాతో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు నిర్వహించనుంది. వివిధ రంగాల్లో తెలంగాణ స్టార్టప్, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణల ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో మూడు గంటలపాటు జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.




# ఏపీలో ప్రతి రోజూ 7000 టన్నుల చెత్త

రాజమండ్రి,ఆగస్ట్14 ఏపీలో ప్రతి రోజూ 7000 టన్నుల చెత్త వస్తోందని మంత్రి నారాయణ తెలిపారు. శుక్రవారం రాజమండ్రి మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత చెత్త ప్రభుత్వం ప్రజలపై చెత్త పన్ను వేసిందని మండిపడ్డారు. చెత్త పన్ను వేసినా లక్షల టన్నుల చెత్త వదిలేసి వెళ్లిపోయిందన్నారు. మున్సిపాలిటీల్లో మిగిలిన మొత్తం 70 లక్షల టన్నుల చెత్తను అక్టోబర్ నాటికి పూర్తిగా తొలగిస్తామని చెప్పారు. 2014-19 లో 10 వేస్ట్ టు ఎనర్జీ ఎ÷-లాంట్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని.. గత ముఖ్యమంత్రికి అవగాహన లేక వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లను రద్దు చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. కడప, కర్నూలు, తిరుపతి, నెల్లూరు, విజయవాడ, పెద్దాపురంలో ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. పెద్దాపురంలో వేస్ట్ టు ఎనర్జీ ఎ÷-లాంట్ పూర్తి కాగానే రాజమహేంద్రవరంలో వచ్చే చెత్తను అక్కడికి తరలిస్తామన్నారు. ఈలోగా వ్యర్థాల నిర్వహణ కోసం 107 మున్సిపాలిటీల్లో ఫ్రెష్ వేస్ట్ చేస్తున్నామని అన్నారు. సెప్టెంబర్ నెలాఖరులోగా ఈ ఎ÷-లాంట్‌లు పూర్తి చేసి ఘన వ్యర్థాల నిర్వహణ చేస్తామన్నారు. రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని సీఎం చెప్పారని,
విలీన గ్రామాల అంశంపై కోర్టు తీర్పు రాగానే ఎన్నికల నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# నేడు రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ



ప్రభుత్వ భూములు/స్థలాలు కాకపోతే, ఆ భూములపై న్యాయస్థానాల్లో వివాదాలు లేకపోతే..వాటిని నిరభ్యంతరంగా రిజిస్ట్రేషన్ కార్యకలాపాలకు అనుమతించాల్సిందిగా నిర్దేశించామన్నారు. ఒక్క అంగుళం భూమి కూడా ఎక్కడికీ పోదని, ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. 22ఏ జాబితాకు సంబంధించి ఏదైనా అంశం మీడియా దృష్టికి వస్తే.. తన నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించాలని, గంటలోపే స్పందిస్తానని అన్నారు. ఇప్పటికే కోర్ ఏరియా పరిధిలోని 46 మంది సబ్ రిజిస్ట్రార్‌లను ఆదేశాలు ఇచ్చామన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ రఘురాంరెడ్డితో కలిసి మంత్రి పొంగులేటి మీడియాకు వివరించారు. స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ, క్యూర్ పరిధిలో ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చడం, సన్నవడ్లకు బోనస్ వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు.

# చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

ఆలోచనలను కొనసాగిస్తోందని తెలిపారు. కుల నిర్మూలన, సామాజిక చైతన్యం సాధించాలంటే అందరూ కలిసి చదువుకోవడం, జీవించడం అవసరమన్నారు. అందుకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను తీసుకొస్తున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నామని, నర్సరీ నుంచి విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. వారి స్ఫూర్తితో విద్యలో రాణించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పారదర్శకంగా అమలు చేస్తామని, ముందుగానే నిధులు అందించే విధానాన్ని తీసుకొస్తున్నామని చెప్పారు.ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఏ కళాశాలా అడ్డుకోలేని విధంగా చర్యలు చేపడుతున్నామని రేవంత్ అన్నారు. సర్టిఫికెట్ ఒక్కటే ఉద్యోగానికి సరిపోదని ఆయన స్పష్టం చేశారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు నైపుణ్యాలను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్కిల్స్ ఉంటేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో నర్సింగ్ రంగంలో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. 2024లో టాటా సంస్థతో కలిసి 119 నియోజకవర్గాల్లో ఏటీసీలను ఏర్పాటు చేశామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయా కేంద్రాల్లో చేరిన విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్టైఫండ్ ఇస్తున్నామని చెప్పారు. విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాలను అందిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే కేవలం మార్కులు, డిగ్రీలు సరిపోవని, నైపుణ్యాలూ అవసరమని అన్నారు. గ్రూప్-1 నియామకాల్లో బీసీలకు పెద్ద సంఖ్యలో అవకాశాలు లభించాయని తెలిపారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని వెల్లడించారు. సిరాజ్, నిఖత్, దీప్తి వంటి క్రీడాకారులకు ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు గురించి ఎంత బాధ్యతగా ఆలోచిస్తారో, తానూ అంతే బాధ్యతగా ఆలోచిస్తానని రేవంత్‌రెడ్డి అన్నారు.
క్రీడల్లో రాణించి పతకాలు తీసుకొస్తే నగదు నజరానాలతో పాటు ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తనదేనని చెప్పారు. సామాజిక చైతన్యంతో తమ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. మాదిగలు దశాబ్దాలుగా పోరాడుతున్న ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించామని చెప్పారు. దేశంలో బీసీ జనగణన



చేపట్టడానికి ఎవరూ ధైర్యం చేయలేదని, బ్రిటిష్ పాలన తర్వాత తొలిసారిగా బీసీల లెక్క తేల్చామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఏడాదిలోనే కులగణన పూర్తి చేశామని తెలిపారు. కులగణనలో కొందరు మాజీ ముఖ్యమంత్రులు, మాజీ మంత్రులు పాల్గొనకుండా వ్యతిరేకించారని ఆరోపించారు. బలహీన వర్గాలకు ఉద్యోగాలు, అవకాశాలు కల్పించాలంటే వారి జనాభా లెక్కలు తెలియాలని, అందుకే కులగణన చేపట్టామని సీఎం వివరించారు. ప్రతి సమస్యను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ప్రజలను గొర్రెలు, బర్రెలు పెంచుకోవాలని, చెప్పులు కుట్టుకోవాలని, చేపలు పట్టుకోవాలని చెప్పిందని రేవంత్‌రెడ్డి విమర్శించారు.

# శాసన మండలి, శాసన సభ సమావేశాల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలి

కొయ్యే మోషేను రాజు, శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చింతకాయల అధికారులను ఆదేశించారు. శుక్రవారం అమరావతిలోని శాసన సభ ప్రాంగణంలో శాసన మండలి, శాసన సభ సమావేశాల నిర్వహణకు సంబంధించి సాధారణ ఏర్పాట్లు, పరిపాలనా అంశాలు, సభ్యులకు అందించాల్సిన సేవలు, శాంతిభద్రతలు, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను సమీక్షించేందుకు సర్వీసెస్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, సాధారణ పరిపాలనా శాఖ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, అదనపు డీజీపీ మధుసూదన రెడ్డితో వారు వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమావేశాల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

### పెండింగ్ ప్రశ్నలకు సత్వరమే సమాధానాలు...

ఈ సందర్భంగా శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేను రాజు, శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చింతకాయల మాట్లాడుతూ సభా సమావేశాల్లో సభ్యులు అడిగే ప్రశ్నలకు నిర్ణీత సమయంలో సమాధానాలు అందించడం అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశమని పేర్కొన్నారు. అయితే కొన్ని ప్రశ్నలకు సమాధానాలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండటం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత శాఖల నుంచి సకాలంలో, స్పష్టంగా, సమగ్రంగా సమాధానాలు అందేలా పటిష్టమైన సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమాధానం ఇవ్వడానికి వీలుకాని ప్రశ్నలు ఏవైనా ఉంటే, అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేస్తూ సంక్షిప్త సమాధానం అందించాలని సూచించారు.
అదేవిధంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలను సమీక్షించి, వాటిపై తగిన నిర్ణయం తీసుకోవాలని, అవసరమైన చోట చట్టబద్ధమైన విధానాన్ని అనుసరించి పెండింగ్ జాబితా నుంచి తొలగించే ప్రక్రియను చేపట్టాలని సూచించారు. శాసన మండలి, శాసన సభల గౌరవాన్ని, సభ్యుల హక్కులను దృష్టిలో ఉంచుకుని ప్రశ్నలకు సమాధానాల ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

# విద్యుత్ దీపాల అలంకరణతో నగరంకు మరింత శోభ

అమరావతి, ఆగస్టు 14: భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ, సచివాలయ భవనాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ప్రతిబింబించేలా సచివాలయంలోని ఐదు భవనాలను ప్రత్యేక విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. అసెంబ్లీ భవనాన్ని సైతం వివిధ రకాల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించడంతో భవన సముదాయం విద్యుత్ కాంతులతో మిరుమిట్లు గొలుపుతోంది. అసెంబ్లీ, సచివాలయ ప్రాంగణాల్లోని రహదారులకు ఇరువైపులా, సెంట్రల్ పార్కులో వివిధ రంగులతో కూడిన ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం ప్రాంగణం విద్యుత్ వెలుగులతో శోభాయమానంగా మారి పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది.

# ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

సంగారెడ్డి,ఆగస్ట్14 ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత స్మార్ట్‌గా మారు తోంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రేషన్ కార్డులను పంపిణీ చేస్తామంటూ ఊరిస్తూ వచ్చారు. సంగారెడ్డిలో శనివారం పంద్రాగస్ట్ పురస్కరించుకుని సిఎం రేవంత్ రెడ్డి స్మార్ట్ కార్డును పంపిణీ చేయనున్నారు. అదేరోజు రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికా రులు కార్డులు అందచేయను న్నారు. సంగారెడ్డిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారు. స్తాని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి దగ్గరుండి ఏర్పాట్లు పరిశీలించారు. 12 ఏళ్లకు పైగా జిరాక్స్ కాగితాలే లబ్ధిదారులకు రేషన్ కార్డులుగా ఉపయోగపడుతూ వచ్చాయి. జిరాక్స్ కాగితాలు చినిగిపోతూ ఇబ్బంది పడుతు న్న లబ్ధిదారులు రేషన్‌కార్డులు ఎప్పుడెప్పు డాని ఎదురుచూస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం పంద్రాగస్టు రోజు నుంచి సరి కొత్త హంగులతో పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డులను అందించడానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ముద్రణ పూర్తి చేసు కున్న స్మార్ట్ రేషన్ కార్డులు సిద్ధంగా ఉంచారు. స్వాతంత్య దినోత్సవం రోజున సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారం భించిన వెంటనే లబ్దిదారులకు పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. గతంలో దారిద్య రేఖకు దిగువ ఉన్నవారికి తెలుపు రంగు కార్డులు, ఎగువనున్నవారికి గులాబీ రంగు కార్డులు ఉండేవి. గులాబీ రంగు కార్డుదారులకు బియ్యం మినహా ఇతర సరుకులు పంపిణీ చేసేవారు. రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీకి పరిమితం కావడంతో గత ప్రభుత్వం గులాబీ కార్డులను రద్దు చేసింది.ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, ఆధునికంగా మార్చే దిశగా ఎలాంటి ట్యాంపరింగ్ చేయడానికి వీలులేని విధంగా ఏటీఎం, పాన్‌కార్డు మాదిరిగా డిజిటలైజేషన్, స్మార్ట్ టెక్నాలజీ ఆధారితంగా పంపిణీ చేసే పీవీసీ కార్డు, చిప్, బార్‌కోడ్, డిజిటల్ వెరిఫికేషన్ వంటి టెక్నాల జీతో స్మార్ట్ రేషన్‌కార్డులు ముద్రించారు. కార్డు స్కాన్ చేయడంతో అందులో ఉన్న కుటుంబ సభ్యులకు పూర్తి సమాచారం వస్తుంది. ఆధునిక భద్రతా ఫీచ ర్లను పొందుపరచి స్మార్ట్ కార్డులు లబ్ధిదారులను ఆగస్టు 15 స్వాతంత్య దినోత్సవం రోజు నుంచి లబ్ధిదా రులకు చేరనున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే రేషన్ సరుకులు బయోమెట్రిక్ ద్వారా రేషన్ దుకాణాల్లో ఎక్కడైనా సరుకులు పొందే అవకాశం ఉంది. అయితే కొన్ని ప్రాంతాల్లో లబ్ధిదా రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపణలు వస్తు న్నాయి. స్మార్ట్ కార్డు ద్వారా రాష్ట్రంలోని ఏ రేషన్ దుకాణంలోనై నా సరుకులు పొందడానికి సులువుగా మారు తుంది. క్యూఆర్ కోడ్ ఉండడంతో కార్డులు డూప్లికేట్ కాకుండా ఉంటుంది. జిల్లాల్లో




ప్రస్తుతం రేషన్‌కార్డు కలిగిన లబ్ధిదా రులందరికీ స్మార్ట్ కార్డులను రేషన్ షాప్‌లో పాత కార్డు చూపించి స్మార్ట్ కార్డును పొందవచ్చు. అంతే కాకుండా టీఎస్‌ఈపాస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని కూడా స్మార్ట్ కార్డు తీసుకునే వీలు కల్పిస్తున్నారు. కొత్తగా అందించే స్మార్ట్ రేషన్ కార్డులు ముందు భాగంలో కుటుంబ యజమాని ఫొటో, రేషన్ కార్డు నంబర్, రేషన్ దుకాణం నంబర్ ముద్రిస్తారు. కార్డు వెనకవైపు కుటుంబ సభ్యుల వివరాల తో పాటు ఇతర అవసరమైన సమాచారాన్ని పొందుపరిచారు

## ఇంద్రకీలాద్రిపై శ్రావణ సందడి

**- తొలి శక్రవారంతో భారీగా భక్తుల రాక**
**-మరోవైపు వర్షాల కోసం వరుణయాగం ప్రారంభం**



విజయవాడ,ఆగస్ట్14 :ప్రముఖ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శ్రావణ మాస సందడి మొదలైంది. శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా ఇంద్రకీలాద్రికి భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయంలో ఆగస్టు 21వ తేదీన వరలక్ష్మి వ్రతం జరుగనుంది. వరలక్ష్మి వ్రతం నాడు వరలక్ష్మీదేవిగా దుర్మమ్మ దర్శనమివ్వనున్నారు. అలాగే ఈనెల 27, 28, 29 తేదీలలో పవిత్రోత్సవాలను నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 4వ తేదీన సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరుగనున్నాయి. శ్రావణమాసంలో ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రత్యేక కుంకుమ పూజలను అర్చకులు నిర్వహించనున్నారు. మరోవైపు, విజయవాడలో వరుణయాగం ఘనంగా ప్రారంభమైంది. వేదపండితులు.. కృష్ణా నదిలోకి దిగి ప్రత్యేక జపాలు చేశారు. ?లోకకల్యాణార్థం, సమృద్ధిగా వర్షాలు కురవాలని ఇంద్రకీలాద్రిపై త్రయాహ్నిక వరుణ యాగాలు, వరుణ జపాలను నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ ఉత్తర్వులు మేరకు వరుణ యాగాన్ని చేపట్టారు. ఈ నెల 14 నుంచి 16 వరకు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ?దుర్గాఘాట్, పాత యాగశాలలో 3 రోజుల పాటు విశేష హోమాలు, జపాలు, ఘటాభిషేకాలు జరుగనున్నాయి.

## నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం

- **అదే విషయం చెప్పాను తప్ప ఎవ్వరినీ నొప్పించలే**
- **మరోమారు స్పష్టం చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్**

యాదాద్రి,ఆగస్ట్14: కాంగ్రెస్‌లో బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైందని మాత్రమే తాను చెప్పానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. నిన్న చేసిన ఈ వ్యాఖ్యలపై మరోసారి మీడియాకు ఆయన క్లారిటీ ఇచ్చారు. శుక్రవారం యాదాద్రి జిల్లాలోని చౌటుప్పల్ సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాజ్‌గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు. తానెక్కడా కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదని, విమర్శించనని రాజ్‌గోపాల్ రెడ్డి తేల్చిచెప్పారు. నిజమైన కాంగ్రెస్ నాయకులను అణిచివేస్తున్నారనే విషయాన్ని తాను గుర్తు చేశానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో భాగంగా ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలని సూచించారు. సీమాంధ్ర పాలకులు, సీమాంధ్ర మీడియా చెప్పుచేతల్లో తెలంగాణ కాంగ్రెస్, ప్రభుత్వం నడపవద్దని కోరారు. ప్రజాపాలన అంటే పేదల కోసం పని చేయాలని సూచించారు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లకు సీమాంధ్ర నాయకుల కోసం కాదని తెలిపారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధి కూడా కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## నేరాల స్వరూపం మారుతోంది

- **సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో అవేర్‌నెస్**
- **రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్‌కు అవగాహన**

**డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడి**

హైదరాబాద్,ఆగస్టు14 నేరాల స్వరూపం ఎప్పటికప్పుడు మారుతోందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారిలో రిటైర్డ్ ఉద్యోగులే ఎక్కువగా ఉంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సురక్ష కా తిరంగా సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమంలో డీజీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సురక్ష కా తిరంగా కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్‌ను భాగస్వామ్యం చేస్తూ అవగాహన కల్పిస్తున్నామని డీజీపీ తెలిపారు. కొన్నేళ్ల క్రితం వరకు ఫిజికల్ దోపిడీలు జరిగేవని.. కానీ ఇప్పుడు నార్కోటిక్, సైబర్ నేరాలు పెరిగాయని వెల్లడించారు. నార్కోటిక్స్ బారినపడి విద్యార్థులు, యువకులు తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారు.. ఫిర్యాదు చేయడానికి కూడా వెనకాడుతున్నారని చెప్పుకొచ్చారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారు.. ఎవరు ఏం అనుకుంటారోనని బయటకు కూడా చెప్పుకోవడం లేదని డీజీపీ అన్నారు. తాము 40 రకాల సైబర్ నేరాలను గుర్తించామని తెలిపారు. ఇందులో ఎక్కువగా ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ ఉంటున్నాయని వివరించారు. తాము ఎంత అడ్డుకట్ట వేస్తున్నా.. సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ కొత్తగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

## బోరులో మోటర్ తీస్తుండగా దుర్ఘటన

జయశంకర్ భూపాలపల్లి,ఆగస్టు14: జిల్లాలోని మల్హార్ మండలం కొయ్యూరులో విషాద ఘటన చోటు చేసుకుంది. విద్యుత్ షాక్‌తో తండ్రి, కొడుకు మృతి చెందడం తీవ్ర కలకలం రేపుతోంది. కాటారం మండలంలోని మార్వాడిపల్లి గ్రామానికి చెందిన తండ్రి కొట్టేకోళ్ల బాపు(48), కొడుకు మనోజ్(20) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కొయ్యూరు శివారులో వ్యవసాయ భూమి ఉంది. ఈ క్రమంలో తమ వ్యవసాయ భూమి వద్ద బోరులోని మోటారు తీసేందుకు తండ్రీకొడుకు వెళ్లారు.

అయితే మోటారు తీస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. తండ్రి, కొడుకుల మృతితో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబానికి చెందిన ఇద్దరు ఒకేసారి ప్రాణాలు కోల్పోడంతో బంధువులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తుంగభద్రకు పెరిగిన జలప్రవాహం

అనంతపురం,ఆగస్ట్14 తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ 87.45 టీఎంసీలకు చేరింది. జలాశయం నీటిమట్టం 1,628.20 అడుగులకు చేరింది. గత 24 గంటల్లో సగటున 26,834 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం 23,290 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. జలాశయం నుంచి వివిధ కాలువలకు 2,226 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తుంగభద్ర జలాశయం నూతన క్రస్ట్ గేట్లు మూడు రంగులతో ఆకట్టుకున్నాయి. స్వాతంత్య దినోత్సవం రెండు రోజులు ఉండగానే జలాశయం బోర్డు అధికారులు క్రస్ట్‌గేట్లు రంగులు విద్యుత్ కాంతులతో పర్యాటకులను ఆకట్టుకునేలా మార్చారు. ఈ ఏడాది జలాశయంలోకి ప్రస్తుతం భారీగా నీరు చేరుతున్నాయి. 15వ తేదీన జలాశయాన్ని తిలకించడానికి పర్యాటకులు భారీగా తరలిరానుండటంతో ఈపాటికే జలాశయం వచ్చేవారికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టామని బోర్డడ అధికారులు తెలిపారు.

## పెడదోవ పట్టిన కన్నకొడుకులు

**తట్టుకోలేక మాతృమూర్తి ఆత్మహత్య**

రంగారెడ్డి,ఆగస్ట్14 నగరంలోని కూకట్‌పల్లిలో విషాద ఘటన చోటు చేసుకుంది. కన్న కొడుకులిద్దరూ పెడదోవ పట్టడంతో ఆ తల్లి తీవ్ర మానసిక వేదనకు గురై బలవన్మరణానికి పాల్పడ్డారు. ఒక కొడుకు తండ్రిని చంపి జైలులో ఉండగా, మరో కొడుకు గంజాయికి బానిసయ్యాడు. ఇలా చేతికి అందివచ్చిన కొడుకులిద్దరూ పెడదోవ పట్టడంతో తట్టుకోలేక పోయిన తల్లి ఆత్మహత్య చేసుకుంది.

రంగారెడ్డి జిల్లా జన్వాడకు చెందిన తిరుపతి రవీందర్ భార్య సుధ. కేపీహెచ్‌బీ సర్దార్ పటేల్ నగర్‌లోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో హౌస్ కీపింగ్‌లో పనిచేస్తున్న సుధ.. అక్కడే ఓ గదిలో నివాసం ఉంటోంది. ఈమెకు ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు కొన్నేళ్ల కిందట తండ్రిని చంపిన కేసులో చర్లపల్లి జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. అలాగే చిన్న కొడుకు గంజాయికి బానిసై నిత్యం తల్లిని వేధింపులకు గురిచేసేవాడు. దీంతో మనోవేదనకు గురైన సుధ ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వా స్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమాజంలో చెడు వ్యసనా లు, పెడదోవ పడుతున్న యువత వల్ల కుటుంబాలు ఏ విధంగా కూలిపోతున్నాయో చెప్పడానికి ఈ ఘటన ఒక సజీవ సాక్ష్యం. కన్నబిడ్డల బాధ్యతారాహిత్యం, మత్తు పదార్థాల మహమ్మారి ఒక అమాయక తల్లి ప్రాణాన్ని బలితీసుకోవడం సమాజ నైతికతకే తీరని కలంకమై నిలిచింది

## సిఎం కనుసన్నల్లో నిషేధిత జాబితా

**బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ విమర్శ**



హైదరాబాద్,ఆగస్ట్14(ఆర్‌ఎన్‌ఎ):తెలంగాణలోని పలువురు ఐఏఎస్ అధికారులపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో భాగంగా కొంతమంది ఐఏఎస్ ఆఫీసర్లు ఉద్దేశపూర్వకంగా భూములను నిషేధిత జాబితాలో పెడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి నుంచి లేదా అయనకు సంబంధించిన వారి నుంచి క్లారిఫికేషన్ వచ్చిన తరువాత వాటిని క్లియర్ చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఇది నేరుగా సీఎం కనుసన్నల్లోనే జరుగుతోందని ఆరోపణలు గుప్పించారు. భూముల విలువ ఎక్కువగా ఉన్నచోట ఈ తరహా దందా నడుస్తోందని ఎంపీ వ్యాఖ్యానించారు. ఇది కేవలం బాధితుల నుంచి డబ్బులు వసూలు చేయడంలో భాగమే అని అన్నారు. బాధితులు కాళ్లు అరిగేలా కలెక్టర్ కార్యాలయాలు, సబ్ రిజిస్టార్ ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నారని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

## పారిశ్రామిక వేత్తలుగా డ్వాక్రా మహిళలు

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



అమరావతి,ఆగస్ట్14 డ్వాక్రా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గ్రామాల్లో ఆహార శుద్ధి పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్(పీఎంఎఫ్‌ఎంఈ) పథకాన్ని స్త్రీనిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్‌తో అనుసంధానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఈ పథకంలో అర్హత కలిగిన డ్వాక్రా మహిళలు రూ.3లక్షల వరకు యూనిట్ వ్యయంతో ఆహార శుద్ధి యూనిట్లను స్త్రీనిధి రుణం ద్వారా ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఈ పథకంలో మహిళలు పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్, చిరుధాన్యాలు, పప్పులు, మసాలాలు, పచ్చళ్లు, పిండి పదార్థాలు, స్నాక్స్ వంటి ఆహార ఉత్పత్తుల తయారీ యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ప్రతి జిల్లాలోని జిల్లా సమాఖ్యలను డిస్ట్రిక్ట్ రిసోర్స్ ఆర్గనైజేషన్స్‌గా పరిగణించి వారి ద్వారా ఆసక్తి, సామర్థ్యం ఉన్న డ్వాక్రా మహిళలను గుర్తించడం జరుగుతుందన్నారు. మహిళలకు కేవలం రుణం ఇవ్వడమే కాకుండా.. వారి వ్యాపారం విజయవంతం అయ్యే వరకు ప్రభుత్వ తోడ్పాటు ఉంటుందన్నారు.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



న్యూఢిల్లీ,ఆగస్ట్14: భారత్‌లో బంగారం ధరలు నేడు మరోసారి తగ్గాయి. అంతర్జాతీయ అనిశ్చితులకు తోడు ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు దిగడంతో నేడు భారత్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.710 మేర తగ్గింది. గురువారం కూడా పసిడి ధర రూ.1,260 మేర తగ్గిన విషయం తెలిసిందే. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (ఆగస్టు 14) ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,52,890గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర నిన్నటితో పోలిస్తే రూ.650ల మేర తగ్గి రూ.1,40,150కు చేరుకుంది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,14,670 వద్ద కొనసాగుతోంది.

# జర్నలిస్టులకు ఇళ్ల కేటాయింపు నిష్పక్షపాతంగా జరగాలి



అభ్యుదయం – కూకట్ పల్లి (ఆగస్టు 14): కూకట్‌పల్లి మండల పరిధిలో జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలని కోరుతూ సీనియర్ జర్నలిస్టులు మండల రెవెన్యూ అధికారి అశోక్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాల కేటాయింపులో అర్హత, సీనియారిటీ, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించిన అనంతరం పారదర్శకంగా కేటాయింపులు చేపట్టాలని కోరారు. ఏ విధమైన రాజకీయ, వ్యక్తిగత లేదా ఇతర ప్రభావాలకు తావులేకుండా అర్హులైన జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ను కలిసి ఇదే విషయం పై వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. గతంలో కూడా చాలా సార్లు ఇళ్ల కోసం ఇళ్ల స్థలాల కోసం అప్లికేషన్లు వాటి కోసం డబ్బులు భారీగా వసూలు చేసి చివరికి చేతులు ఎత్తేశారని ఇటువంటి వారి పట్ల జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం నిజమైన జర్నలిస్టులను గుర్తించి వారికి ప్రాధాన్యత ఇస్తుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు.

**సీనియారిటీ ఆధారంగా పరిశీలిస్తాం: ఎంఆర్ఓ**

వినతిపత్రాన్ని స్వీకరించిన ఎంఆర్ఓ అశోక్‌కుమార్ స్పందిస్తూ.. జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపునకు సంబంధించిన అంశాలను నిబంధనల ప్రకారం పరిశీలిస్తామని తెలిపారు. అర్హత, సీనియారిటీ, క్షేత్రస్థాయి వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ప్రక్రియను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అర్హులైన జర్నలిస్టులకు న్యాయం జరిగేలా సంబంధిత అంశాలను పరిశీలిస్తామని పేర్కొన్నారు.

**సీనియర్ జర్నలిస్టులు పాల్గొనడం**

ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కట్టెల మల్లేష్, సి.హెచ్. రామారావు, మండపాక కళ్యాణ్ చక్రవర్తి, దాదె వెంకట్, ఎం.ఎస్. ఆనంద్‌రావు, అంబటి వెంకట్, జంగాల నాగార్జున, బి. శంకర్ పాల్గొన్నారు.

కూకట్‌పల్లి ఎంఆర్ఓ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ జర్నలిస్టులు.

# స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా పనిచేద్దాం





ఆగస్టు 14,కనేకల్లు : 80 వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రం నందు గల బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులతో పాటు మండల పరిషత్ అధికారులు మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాల నుండి బసవేశ్వర సర్కిల్ వరకు భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారులు విద్యార్థులచే వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర 2024 లక్షల గుణగుణంగా భారత పౌరులుగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మండల పరిషత్ అధికారి షేక్షావలి, డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి, ఐకెపి ఎపిఎం ఆంజనేయులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున మరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో 200 అడుగుల భారీ జెండా ర్యాలీ





ఆగస్టు 14,రాయదుర్గం 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏ ఐ ఎస్ ఎఫ్,ఏ ఐ వై ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం 200 అడుగుల భారీ జాతీయ జెండా ర్యాలీ నిర్వహించారు. కనేకల్ రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీ లక్ష్మీ బజార్ మీదుగా వినాయక సర్కిల్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో 200 అడుగుల పొడవైన భారత జాతీయ జెండా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు, యువత భుజాలపై జెండాను మోస్తూ "వందేమాతరం.. స్వతంత్ర భారత్‌కి జై" అంటూ, మహాత్మా గాంధీ, భగత్ సింగ్, నేతాజి సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్ లకు జేజేలు పలుకుతూ నినాదాలు చేశారు. ప్రభుత్వ మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాల, వెంకటేశ్వర ప్రైవేట్ జూనియర్ కళాశాల తదితర విద్యాసంస్థల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో దేశభక్తి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐఎస్ఎఫ్, అనంతపురం జిల్లా కోశాధికారి ఆంజనేయులు, ఏఐవైఎఫ్ అనంతపురం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కావలి కోట్రేష్ మాట్లాడుతూ 1936 ఆగస్టు 12న లక్నోలోని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం లో ఆవిర్భవించిందని గుర్తు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో వేలాది మంది విద్యార్థులు అమరులయ్యారని తెలిపారు. 1947 ఆగస్టు 15న రాజకీయ స్వాతంత్ర్యం వచ్చినా, 80 ఏళ్ల తర్వాత కూడా ఈ దేశంలో పేదరిక నిర్మూలన, నిరుద్యోగం, విద్య–వైద్యం ప్రైవేటీకరణ, ఆడపిల్లలపై అత్యాచారాలు, ఆకలి చావులు ఇంకా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు."మహాత్మా గాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ లాంటి అమరవీరుల కలలు నెరవేరాలంటే పాలకుల విధానాలు మారాలన్నారు. విద్య, వైద్యం, ఉపాధి హక్కుల కోసం ప్రతి విద్యార్థి, యువత పోరాడాల్సిన అవసరం ఉంది" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ నాయకులు రాజు, కుమార్, తరుణ్, గోపీనాథ్, కేశవ నాయుడు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# రెపరెపలాడిన 1000 అడుగుల త్రివర్ణ పతాకం

- 1000 అడుగుల భారీ త్రివర్ణ పతాకంతో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ
- మున్సిపల్ కార్యాలయం నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు వైభవంగా సాగిన తిరంగా ప్రదర్శన
- పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్,కదిరి
- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

**మారుమోగిన "వందేమాతరం", "భారత్ మాతాకీ జై" నినాదాలు**



కదిరి, ఆగస్టు 14:హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా కదిరి పురవీధులలో దేశభక్తి ఉప్పొంగింది. శుక్రవారం కదిరి పట్టణంలో 1000 అడుగుల సుదీర్ఘమైన భారీ త్రివర్ణ పతాకంతో నిర్వహించిన తిరంగా ర్యాలీ అత్యంత కన్నులపండువగా, జనసందోహం మధ్య ఘనంగా జరిగింది. స్థానిక కదిరి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్, కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి, ర్యాలీని లాంఛనంగా ప్రారంభించారు.

మున్సిపల్ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ భారీ ప్రదర్శన మహాత్మా జ్యోతిరావు పూలే సర్కిల్ మీదుగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సర్కిల్ వరకు కొనసాగింది. 1000 అడుగుల పొడవైన జాతీయ పతాకాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో పట్టుకుని అడుగులు వేశారు. పట్టణ వీధులన్నీ త్రివర్ణ శోభతో మెరిసిపోగా, విద్యార్థుల "వందేమాతరం", "భారత్ మాతాకీ జై" నినాదాలతో కదిరి పురవీధులు మారుమోగాయి.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. "జాతీయ జెండా మన భారతదేశ సార్వభౌమాధికారానికి, త్యాగానికి, విభిన్న సంస్కృతుల ఐక్యతకు దివ్య ప్రతీక. మన మాతృభూమి స్వాతంత్ర్యం కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడానికి 'హర్ ఘర్ తిరంగా' ఒక గొప్ప అవకాశం. ఈ కార్యక్రమాన్ని ఇంతటి విజయవంతం చేసిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, మున్సిపల్ సిబ్బందికి, జిల్లాల అధికారులకు నా ప్రత్యేక ధన్యవాదాలు."పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజానీకం ఈ భారీ ర్యాలీలో శ్రీ సత్యసాయి జిల్లా యంత్రాంగం,కదిరి ఆర్డీఓ కలావతి, కదిరి తహశీల్దార్ రెడ్డి శేఖర్,వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, వివిధ పాఠశాలల మరియు కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. ర్యాలీ అనంతరం అంబేద్కర్ సర్కిల్ వద్ద జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులతో కలసి దేశ సమగ్రత, ఐక్యత మరియు దేశసేవపై దేశభక్తి ప్రతిజ్ఞ చేయించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ బూత్ లను పరిశీలించిన అధికారులు



ఆగస్టు 14,కనేకల్లు : స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం మండల పరిషత్ అధికారులు ఇన్చార్జి ఎంపీడీవో షేక్షావలి, డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి పోలింగ్ బూత్ లను పరిశీలించారు. సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికల ప్రక్రియలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు గల అన్ని పోలింగ్ బూత్ లను వారు పరిశీలించారు.

# ఎమ్మెల్యే గారు మా సమస్యను పరిష్కరించండి..

**- వైయస్సార్ సర్కిల్ వద్దనున్న రిపోర్టర్స్ కాలనీ వాసులు ఆవేదన**
**- విద్యుత్ సమస్యను పరిష్కరించాలని వేడుకోలు**

ఓడి చెరువు అక్షరం ఆగస్టు 14:
ఓబులదేవుల చెరువు మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్ బ్యాక్ సైడ్ ఉన్న దాదాపు 45 కుటుంబాలకు రహదారి మరియు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని ఆ కాలనీవాసులు కోరుతున్నారు మండల కేంద్రంలోని రిపోర్టర్స్ కాలనీలో ఉన్న విద్యుత్ స్తంభాల నుంచి కనెక్షన్లు తీసుకుంటున్నామని వారు పేర్కొన్నారు. రిపోర్టర్స్ కాలనీ వెనకవైపు ఉన్న ఈ కాలనీలోని 45 గృహాలకు విద్యుత్ సరఫరా కోసం దాదాపు 150 నుంచి 180 మీటర్ల సర్వీస్ వైరు కావాల్సి వస్తుందని వారు తెలిపారు . ఈ విధంగా విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసుకున్నప్పటికీ వర్షాకాలంలో వైర్లు తెగిపోయి అనేక ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు ఈ 45 నివాస గృహాలకు రహదారి సౌకర్యం కూడా లేదని వాపోయారు . కనీసం ద్విచక్ర వాహనాల సైతం వెళ్లేందుకు వీలు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి కల్పించాలని విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని అనేకమార్లు వినతి పత్రాలను సంబంధిత అధికారులకు అందించామని అయితే అధికారులు స్పందించలేదని తెలిపారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం విద్యుత్ అధికారుల సైతం కలిశామని, అందుకు ఒక్కో స్తంభానికి 20000 రూపాయలు దాకా ఖర్చు అవుతుందని అలా ఆరు స్తంభాలు దాకా ఏర్పాటు చేయవలసి ఉంటుందని అధికారులు తెలిపారని అందుకు కాలనీవాసులు సైతం సిద్ధంగానే ఉన్నట్టు తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులను కలిసి విన్నవించిన కనీసం స్పందన లేదన్నారు. కాలనీలో పిల్లలు పాఠశాలలకు వెళ్లాలన్న చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు ఆంజనేయ స్వామి గుడి దగ్గర నుంచి సిమెంటు రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేశారు .ఈ రహదారి మొత్తం బురదమయమై ఈ రహదారిలో చిన్న పిల్లలు పాఠశాలలకు వెళ్లాల్సి ఉంటుందని అనేకసార్లు పిల్లలు బురద నీటిలో పడి ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఇప్పుడైనా ఎమ్మెల్యే సింధూర రెడ్డి ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ఈ సమస్యలను పరిష్కరించాలని కాలనీలో ప్రజలు వేడుకుంటున్నారు

# సమాజ సేవకులకు అవార్డుల ప్రధానం

రాజంపేట ఆగస్టు 14: రాజంపేట శివాలయం పక్కన ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో 80 వ భారతదేశ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా వందేమాతరం, జనగణమన జాతీయ గీతాలను ఆలపించారు. ఆలపించిన పలువురికి 80వ స్వాతంత్ర దినోత్సవ సర్టిఫికెట్లను బహుమతులను అంద జెశారు ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం 10:30 లకు కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో భారత దేశ 80 వ స్వాతంత్ర దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని సమాజ హితులు సేవకులు గురువులు అయిన భారత దేశ మాజీ రాష్ట్రపతి కీ.శే ఏపీజే అబ్దుల్ కలాం గారి స్వహస్తాలతో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ముమ్మడి నారాయణరెడ్డి, ఆధ్యాత్మిక ప్రవచనకర్త పసుపులేటి శంకర్, ఆంజనేయ స్వామి వారి దేవస్థాన పాలకమండలి చైర్మన్ తలిశెట్టి రమేష్ బాబు ముఖ్య



అతిథులుగా పాల్గొని పూజాధికాలు అనంతరం అవార్డులు, బిరుదు ప్రధాన కార్యక్రమము. నిర్వహించినట్లు వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్ కళాంజలి తెలిపారు.

మాజీ రాష్ట్రపతి స్వర్గీయ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ముమ్మడి నారాయణరెడ్డి కి భక్త పోతన సాహిత్య సేవారత్న అవార్డు . ఒంటిమిట్ట కోదండ రామస్వామి వారి భకుడు చెంగారి



రామాంజనేయులు కి " శ్రీ రామ భక్త " బిరుదు శ్రీ సత్య సాయి జిల్లాకు చెందిన వెటర్న్ జర్నలిస్టు లు, టి డి జయరామిరెడ్డి, బాబా ఫక్రుద్దీన్, రామ చంద్రయ్య, లకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన హైదరాబాద్ నగర నివాసి జానపద కళాకారుడు వెంకటేశ్వర్లులకు " నాట్యాచార్య " న్యాయమూర్తి శంకర్ కు కలిసేట్టి రమేష్ కు గౌరవ పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో కళాంజలి సంస్థ కార్యదర్శి ఎస్ విజయ్ కళ్యాణ్, రాధిక , సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయం
The Pride of Telugu national daily





# సర్ఫరాజ్ స్పిన్ ను సమర్థవంతంగా ఆడగలడు

## టీమిండియా క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్

శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు ముందు టీమిండియా క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌కు తన బాధ్యతలపై మేనేజ్‌మెంట్ స్పష్టతనిస్తే ఉప ఖండపు రారాజుగా ఎదుగుతాడని తెలిపాడు. సర్ఫరాజ్ ఖాన్ స్పిన్ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఆడగలడని అభిప్రాయపడ్డాడు. శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సిద్దమైంది. శనివారం(ఆగస్ట్ 15) నుంచి గాలే ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా తొలి టెస్ట్ మొదలవ్వనుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027 ఫైనల్ బెర్త్‌పై ఆశలు సజీవంగా ఉండాలంటే.. ఈ సిరీస్ గెలవడం టీమిండియాకు కీలకం. అయితే భారత జట్టును గాయాల బెడద వేధిస్తోంది. జస్‌ప్రీత్ బుమ్రా, సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ రెడ్డి గాయాలతో జట్టుకు దూరమయ్యారు. సాయి సుదర్శన్ స్థానంలో సర్ఫరాజ్ ఖాన్ జట్టులోకి వచ్చాడు. తాజాగా తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ఈ సిరీస్ గురించి మాట్లాడిన అశ్విన్.. సర్ఫరాజ్ ఖాన్‌కు తన బాధ్యతల గురించి క్లారిటీ ఇవ్వాలని మేనేజ్‌మెంట్‌కు సూచించాడు. 'సాయి సుదర్శన్ గాయంతో సర్ఫరాజ్ ఖాన్ జట్టులోకి వచ్చాడు. సర్ఫరాజ్‌కు జట్టులో తన పాత్రపై క్లారిటీ ఇవ్వాలి. కొన్ని కండిషన్స్‌లో అతని సామర్థ్యంపై సందేహం ఉంటే ఆ విషయాన్ని అతనికి చెప్పాలి. ఉపఖండం కండిషన్స్‌లోనే నువ్వు రాణించగలవు, అప్పుడే నీకు అవకాశం ఇస్తామని చెప్పాలి. అప్పుడు సర్ఫరాజ్ ఖాన్ కూడా తన సమయాన్ని వృథా చేసుకోడు. మంచి స్పిన్‌ను ఎలా ఎదుర్కోవాలో మరింత ఫోకస్ పెడుతాడు. ఉంపఖండపు పరిస్థితుల్లో రారాజుగా మారుతాడు. తన కెరీర్‌ను నిర్మించుకుంటాడు. స్పిన్ కాకుండా ఇతర కండీషన్స్‌లో అతను రాణించలేడని భావిస్తే.. ఆ విషయాన్ని అతనికి చెప్పాలి.'అని అశ్విన్ సూచించాడు. అయితే తుది

# శ్రీలంక జట్టును తేలికగా తీసుకోవద్దు

## శ్రీలంక కెప్టెన్ ధనంజయ డి సిల్వా

శ్రీలంకలోని గాలే అంతర్జాతీయ స్టేడియం వేదికగా ఆగస్టు 15 నుంచి భారత్, శ్రీలంక జట్ల మధ్య రెండు మ్యాచ్? ల టెస్ట్ సిరీస్‌లో భాగంగా మొదటి మ్యాచ్ ప్రారంభం కానుంది. తొమ్మిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టు టెస్ట్ సిరీస్ ఆడేందుకు శ్రీలంకలో అడుగుపెట్టింది. ఈ నేపథ్యంలో శ్రీలంక కెప్టెన్ ధనంజయ డి సిల్వా మీడియా సమావేశంలో మాట్లాడుతూ టీమిండియాను హెచ్చరించారు. ఆతిథ్య శ్రీలంక జట్టును తేలికగా తీసుకోవద్దని.. ఈ సిరీస్ టీమిండియాకు అంత సులభంగా ఉండబోదని స్పష్టం చేశారు. భారత్, శ్రీలంక జట్లు చివరిసారిగా 2022లో బెంగళూరులో డే-నైట్ టెస్టులో తలపడ్డాయి. ఆ మ్యాచ్‌లో రోహిత్ శర్మ నాయకత్వంలోని టీమిండియా 238 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. అయితే ఆ తర్వాత ఈ రెండు జట్లు సుదీర్ఘ కాలం పాటు టెస్టుల్లో ఎదురు పడలేదు. ఐసీసీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పరంగా ఈ సిరీస్ అత్యంత కీలకమైనదని.. ప్రస్తుతం స్టాండింగ్స్ లో మెరుగైన స్థానంలో ఉన్న శ్రీలంక భారత్ కు గట్టి పోటీనిస్తుందని ధనంజయ డి సిల్వా ధీమా వ్యక్తం చేశారు. సాధారణంగా గాలే స్టేడియం పిచ్ స్పిన్నర్లకు విపరీతంగా సహకరిస్తుందనే పేరుంది. అయితే ఈ సారి పిచ్ పరిస్థితులు భిన్నంగా ఉంటాయని శ్రీలంక కెప్టెన్ తెలిపారు. గత కొన్ని రోజులుగా పడుతున్న వర్షాల కారణంగా గ్రౌండ్ సిబ్బంది పూర్తి స్థాయిలో పిచ్ ను సిద్ధం చేయలేకపోయినప్పటికీ.. ఈ వికెట్ బ్యాటర్లకు బాగా సహకరిస్తుందని ఆయన వెల్లడించారు. ఇరు జట్ల బ్యాటర్లకు మంచి పరుగులు సాధించే అవకాశం ఉంటుందని డి సిల్వా అభిప్రాయపడ్డారు. గాయపడిన కుశాల్ మెండిస్ స్థానంలో సీనియర్ వికెట్ కీపర్ నిరోషన్ డిక్వెల్లాను జట్టులోకి తీసుకోవడంపై డి సిల్వా వివరణ ఇచ్చారు. 'గాలే స్టేడియంలో వికెట్ కీపింగ్ చేయడం చాలా సవాలుతో కూడుకున్నది. అందుకే టాలెంటెడ్ వికెట్ కీపర్ అవసరం ఏర్పడింది" అని శ్రీలంక కెప్టెన్ తెలిపారు. అలాగే ఈ మ్యాచ్ ద్వారా యువ ఆఫ్ స్పిన్నర్ కేశర నువంత టెస్టుల్లోకి అరంగేట్రం చేసే



అవకాశం ఉందని తెలిపారు.

# తుది జట్టు ఎంపిక తలనొప్పిగా మారింది

## టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్

స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా టీమిండియా ఆడే 600వ టెస్ట్ మ్యాచ్‌కు నాయకత్వం వహించడం చాలా గర్వంగా ఉందని కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ)2027 ఫైనల్ బెర్త్‌ను దక్కించుకోవడమే తమ ముందున్న ఏకైక లక్ష్యమని చెప్పాడు. తుది జట్టు ఎంపిక తలనొప్పిగా మారిందన్నాడు. డబ్ల్యూటీసీ 2027 సైకిల్‌లో భాగంగా శ్రీలంక పర్యటనలో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సిద్దమైంది. రేపు( శనివారం) గాలే అంతర్జాతీయ మైదానంలో ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఇది భారత్‌కు 600వ టెస్ట్ మ్యాచ్. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం నాడే ఈ మ్యాచ్ జరుగుతుండటం ప్రత్యేకంగా నిలిచింది. ఈ సిరీస్‌కు టీమిండియా అన్ని విధాల సిద్దమైంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో శుభ్‌మన్ గిల్ పాల్గొన్నాడు.

సిరీస్ గెలిచి డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ రేసులో నిలవడమే తమ లక్ష్యమని స్పష్టం చేశాడు. 'కెప్టెన్సీ బాధ్యతల్లో నేను చాలా సౌకర్యంగా ఉన్నా. శ్రీలంకతో టెస్ట్ సిరీస్ గెలిచి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉంచుకోవడమే మా లక్ష్యం. డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ దక్కాలంటే.. కనీసం మేం ఏడు టెస్ట్‌ల్లో గెలవాల్సిన అవసరం ఉంది. ఇక్కడి నుంచి ఫ్రెష్‌గా మెదలుపెడుతాం. అంతేకాకుండా స్వాతంత్ర్య దినోత్సవం నాడే భారత్ 600వ టెస్ట్ మ్యాచ్ ఆడుతోంది. ఇలాంటి




చారిత్రాత్మక పోరుకు సారథ్యం వహించడం నాకు దక్కిన గొప్ప గౌరవం. మెరుగైన ప్రదర్శన చేసేందుకు ఆటగాళ్లకు కాస్త సమయం ఇవ్వాలి. కొందరికీ కాస్త ఎక్కువ సమయం పడుతుంది. అయినా సరే వారికి అండగా ఉంటాం. మూడో స్థానంలో సాయి సుదర్శన్ మెరుగ్గా రాణించాడు. కానీ అతను గాయం కారణంగా తప్పుకోవాల్సి వచ్చింది. బీసీసీఐ సీఓఈ, టీమ్ మేనేజ్‌మెంట్ మధ్య ఎలాంటి గ్యాప్ లేదు. మేం కోరుకున్నంత వేగంగా సాయి సుదర్శన్ కోలుకోలేకపోయాడు. అయితే మా జట్టులోని 15 మంది ఆటగాళ్లపై మాకు నమ్మకం ఉంది. తుది జట్టును ఇంకా ఖరారు చేయలేదు. పేసర్ల ఎంపిక తలనొప్పిగా మారింది. గుర్నూర్ బ్రార్ పాత బంతితోనూ అద్భుతంగా బౌలింగ్ చేయగలడు. బౌన్స్‌ను కూడా రాబడతాడు. అయితే ప్రసిధ్ కృష్ణ వామప్ మ్యాచ్‌లో కూడా సత్తా చాటాడు. సిరాజ్‌తో పాటు రెండో పేసర్ ఎవరా? అనేది తేల్చుకోలేకపోతున్నాం. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని తుది జట్టును ఎంపిక చేస్తాం.'అని శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశాడు.

# జెమిమా రోడ్రిగ్స్ కు గాయం..



ఇండియన్ ఉమెన్స్ క్రికెట్ టీమ్ స్టార్ బ్యాటర్ జెమిమా రోడ్రిగ్స్ ఇంజ్యూరీ కారణంగా రాబోయే రెండు బిగ్ టోర్నమెంట్లకు దూరమైంది. ఇంగ్లాండ్ లో జరిగిన 'ద హండ్రెడ్' లీగ్ లో ఆడుతున్న సమయంలో హామ్‌స్ట్రింగ్ గాయం వల్ల ఆమె రాబోయే ఉమెన్స్ ఆసియా కప్ తో పాటు ఏషియన్ గేమ్స్ నుంచి కంప్లీట్ గా రూల్ అవుట్ అయింది. బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ (సీఓఈ) మెడికల్ టీమ్ ఆమెను పరిశీలించి, గాయం తీవ్రత ఎక్కువ ఉండటంతో రెస్ట్ అవసరమని తెలిపినట్లు బిసిసిఐ శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. "ఆగస్టు 3న ఇంగ్లాండ్ లో 'ద హండ్రెడ్' మ్యాచ్ ఆడుతుండగా జెమిమా కుడి తొడ కండరాల గాయానికి గురైంది. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు) లో బిసిసిఐ మెడికల్ టీమ్ ఆమెకు క్లినికల్ టెస్టులు నిర్వహించింది. ఈ టెస్టుల్లో ఆమెకు హై-గ్రేడ్ టియర్ ఉన్నట్లు తేలింది" అని బోర్డు ఒక ప్రకటనలో పేర్కొంది. దాంతో యూఏఈ వేదికగా జరగబోయే ఆసియా కప్, జపాన్ లో జరగబోయే ఏషియన్ గేమ్స్ కు జెమిమా దూరమవ్వక తప్పలేదు. 25 ఏళ్ల జెమిమా స్థానంలో ప్రతీక రావల్ ను ఉమెన్స్ సెలెక్షన్ కమిటీ రీప్లేస్‌మెంట్ గా ఎంపిక చేసింది. ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 13 వరకు దుబాయ్ వేదికగా ఏసీసీ ఉమెన్స్ ఆసియా కప్ జరగనుంది. ఆ తర్వాత సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్ లోని ఐచి-నగోయా వేదికగా ఏషియన్ గేమ్స్ జరగనున్నాయి. కీలకమైన ఈ రెండు టోర్నీలకు ముందు స్టార్ బ్యాటర్ దూరం కావడం భారత జట్టుకు బిగ్ షాక్ అనే చెప్పాలి.

జెమిమా రోడ్రిగ్స్ స్థానంలో ప్రతీక రావల్ ఎంట్రీతో బిసిసిఐ అప్‌డేటెడ్ స్క్వాడ్ ను రిలీజ్ చేసింది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్ గా, స్మృతి మంధాన వైస్ కెప్టెన్ గా టీమ్ ను లీడ్ చేయనున్నారు. జట్టులో షెఫాలీ వర్మ, భారతి ఫుల్మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమలిని (వికెట్ కీపర్), అరుంధతి రెడ్డి, ప్రేమ రావత్, రాధా యాదవ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, నందిని శర్మ, క్రాంతి గౌడ్, ప్రతీక రావల్ ఉన్నారు.



సంపాదకీయం

# దేశవిభజన ఒక చీకటి అధ్యాయం !

స్వాతంత్ర్యం తెచ్చామని కాంగ్రెస్ నేతలు ఇప్పటికీ చంకలు గుద్దుకుంటుంటారు. స్వాతంత్ర్య పోరాటంలో తామే పాల్గొన్నామన్న భావన వ్యాప్తి చేయడం ద్వారా రాజకీయ లబ్ది పొందాలనుకుంటారు. నిజానికి ఎందరో మహానుభావులు ఉద్యమించారు. లక్షల మంది అసువులు బాసారు. అన్నింటికి మించి కాంగ్రెస్ చేసిన దుర్మార్గం కారణంగా దేశం రెండు ముక్కలయ్యింది. లక్షలాది మంది శవాల మీద జెండా ఎగరేశారు. ఓ రకంగా ఆగస్ట్ 14 , 1947 కాళరాత్రి అని చెప్పకతప్పదు. 1947 ఆగస్టు 14 ఉదయం. ఒకవైపు కరాచీలో పాక్ అనే కొత్త దేశం పురుడుపోసుకుంటోందన్న సంబరాలు, మరోవైపు ఢిల్లీలో దశాబ్దాల పారతంత్రం వీడి స్వాతంత్ర్యపు వెలుగులు విరజిమ్మబోతున్నాయన్న సంబరం..కానీ, పంజాబ్, బెంగాల్‌లలోని లక్షలాది ఇళ్లలో మాత్రం హర్షాతిరేకాలు లేవు.. కేవలం కంటిమీద కునుకు లేని భయం, గుండెల్ని పిండేసే అనిశ్చితి మాత్రమే అక్కడి ప్రజల్లో కనిపించింది. దానికి కారణం తెల్లారితే తమ ఊరు, తమ ఇల్లు ఏ దేశంలో ఉంటాయో అక్కడ ఎవరికీ తెలియని దుర్భరమైన పరిస్థితి. సరిహద్దులను నిర్ణయించే బాధ్యతను బ్రిటీష్ న్యాయవాది జాన్ రెడ్‌క్లిఫ్‌కు అప్పగించినప్పటికీ, ఆయన గీసిన ఆ వినాశకరమైన గీత ఆగస్టు 14న బయటకు రాలేదు. ఆ తుది నిర్ణయాన్ని ఆగస్టు 17 వరకు దాచిపెట్టారు. అంటే అర్ధరాత్రి రెండు దేశాలు స్వతంత్రంగా మారినప్పటికీ, వేలాది కుటుంబాలకు తమ సొంత ఇల్లు భారత్‌లో ఉందో, పాకిస్థాన్‌లో ఉందో తెలియని ఒక విచిత్రమైన, విషాదకరమైన పరిస్థితిలో7 ఉండిపోయారు. విభజన ప్రకటన ఇరు ప్రాంతాల ప్రజల్లో తీవ్ర ఆవేదన, ఆందోళన నింపింది. అందుకే ఆగస్టు 14 భారత దేశానికి ఒక చీకటి రోజుగా పరిగణిస్తారు. ఇది స్వాతంత్ర్యం తీసుకుని వచ్చిన దానికన్నా పెను విషాదాన్ని నింపింది. ఒక రకంగా చెప్పాలంటే 1947 ఆగస్టు 14 రాత్రి కేవలం భారత్‌ను చీల్చడానికి ఉద్దేశించిన రోజుగానే చూడాలి. దేశాలను విభజించడానికి గీసిన గీతకు ఆనాటి పెద్దలు అంగీకారం తెలపడం నేటికీ జీర్ణించుకోలేని చరిత్రగా మిగిపోతుంది. విభజనకు గీసిన ఒక గీత మధ్య అసలు మనిషి ఎక్కడ నిలబడ్డాడనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలి పోయింది. ఈ చారిత్రక ఘట్టాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా ఆగస్టు 14న కరాచీలో ఏం జరిగిందో చూడాలి. ఆ రోజు ఉదయం 9 గంటలకు సింధ్ అసెంబ్లీ భవనం బయట ఉత్సాహంతో జనం కిక్కిరిసిపోయారు. మహమ్మద్ అలీ జిన్నా, లార్డ్ మౌంట్‌బాటన్ ఒకే రాచరికపు బగ్గీలో అక్కడికి చేరుకున్నారు. కరాచీలోని రాజ్యాంగ పరిషత్ ప్రత్యేక సమావేశంలో అధికార మార్పిడి పక్రియ అధికారికంగా ముగిసింది. అయితే, మౌంట్‌బాటన్‌కు అక్కడ ఎక్కువ సేపు గడిపే వ్యవధి లేదు. మధ్యాహ్నం 2 గంటలకే ఆయన ఢిల్లీకి పయనమయ్యారు. ఎందుకంటే అదే రోజు అర్ధరాత్రి భారత్ స్వాతంత్య వేడుకల్లో ఆయన పాల్గొనాల్సి ఉంది. ఇక, కరాచీలో సంబరాలు ముగిసి ఢిల్లీలో అర్ధరాత్రి వేడుకలకు వేదిక సిద్ధమవుతుంటే, పంజాబ్‌లో మాత్రం సరిహద్దు రక్తసిక్తమయ్యింది. విభజన వార్త కేవలం పత్రికలకే పరిమితం కాకుండా ప్రజల గుమ్మాల ముందుకు వచ్చింది. హిందువులు, ముస్లింలు, సిక్కులు తమ ఇళ్లను వదిలి వెళ్లాలో వద్దో తెలియక కొట్టుమిట్టాడారు. పంజాబ్‌లో రైళ్లు నడుస్తున్నాయి, కానీ అవి కేవలం ప్రయాణికులను మాత్రమే కాక, ముక్కలైన జీవితాలను మోసుకెళ్తున్నాయి. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 8 మధ్య దాదాపు ఏడు లక్షల మంది శరణార్థులు రైళ్ల ద్వారా సరిహద్దులు దాటారని అంచనా. కానీ, అసలు భయానక దృశ్యం ఆగస్టు 17 తర్వాత మొదలైంది. రెడ్‌క్లిఫ్ లైన్ బహిర్గతమయ్యాక, తమ ఊరు పరాయి దేశంలోకి వెళ్లిపోయిందని తెలిసిన దాదాపు 1.5 కోట్ల మంది ప్రజలు కాలినడకన, బస్సుల్లో, రైళ్లలో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని సరిహద్దులు దాటడం ప్రారంభించారు. మార్గమధ్యంలో శరణార్థుల కాఫిలాలు, రైళ్లపై దాడులు జరిగాయి. దహనమైన, నిశ్శబ్దంగా శవాల దిబ్బగా మారిన రైళ్లు స్టేషన్లకు చేరుకున్నాయి. ఈ హింసలో 5 నుంచి 10 లక్షల మంది లేదా కొన్ని అంచనాల ప్రకారం 15 నుంచి 20 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 75 వేల మంది మహిళలు కిడ్నాప్‌లు, లైంగిక హింసకు గురయ్యారు. దేశమంతా ఒకవైపు పండుగ వాతావరణం, మరోవైపు రక్తపాతంతో అల్లకల్లోలంగా ఉంటే, మహాత్మా గాంధీ మాత్రం ఈ వేడుకలకు చాలా దూరంగా కలకత్తాలోని బెలియాఘాటాలో ఉన్న హైదరీ మంజిల్‌లో ఉన్నారు. కలకత్తాలో ఆగస్టు 16-18 మధ్య జరిగిన హింసలో 4,000 మందికి పైగా చనిపోయిన వేళ, గాంధీ అక్కడే ఉండి శాంతి కోసం నిరాహార దీక్షలు చేపట్టారు. బ్రిటిష్ పాలన అధికారికంగా అంతమై, కొత్త పతాకం ఎగిరింది. కానీ, ఆ వెలుగుల వెనుక దట్టమైన చీకటి దాగి ఉంది. ఒకవైపు అధికార మార్పిడి, మరోవైపు కోట్ల మంది నిరాశ్రయుల కాళ్ల నడకలు..శాల దిబ్బలు వంటివన్నీ కళ్లముందు కదలాడాయి. జిన్నా ఎత్తులకు లొంగిపోవడంతో దేశం భారీ మూల్యం చెల్లించుకుంది.

ప్రజలను నడివీధుల్లో నిరాశ్రయులను చేశారు. ఇప్పటికీ అనేక కుటుంబాలు ఆ క్షోభ నుంచి కోలుకోలేదు. స్వాతంత్ర్యం తెచ్చామని ప్రగల్భాలు పలుకుతున్న నేటి కాంగ్రెస్ నేతలు ఆనాటి మారణహోమానికి సమాధానం చెప్పగలరా? ఈ విభజన కేవలం కాంగ్రెస్ లొంగుబాటు తీరు వల్లే అని ప్రపంచానికి తెలియదా? దేశాన్ని ఐక్యంగా ఉంచడంలో విఫలమైన ఆనాటి కాంగ్రెస్ నాయకత్వాన్ని ఏమనాలి? ఇవన్నీ సమాధానం లేని ప్రశ్నలుగానే ఉన్నాయి.

# అసెంబ్లీకి రాకుండా సమస్యలపై ఎలా మాట్లాడుతారు?

## ఎపిపిఎస్సీ వ్యవహారంపై ఎందుకు నోరు మెదపడం లేదు

## వైసిపికి విజయవాడ ఎంపి కేశినేని చిన్ని ప్రశ్నలు

విజయవాడ,ఆగస్ట్14:అసెంబ్లీకి హాజరుకాని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యలపై ఎలా మాట్లాడతారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రశ్నించారు. అసెంబ్లీకి రావడం, ప్రజా సమస్యలపై చర్చించడం ప్రతిపక్ష నాయకుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఏపీపీఎస్సీ వ్యవహారంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలోనే జగన్ అసెంబ్లీకి దూరంగా ఉంటున్నారని విమర్శించారు. విజయవాడ ఆటోనగర్‌లో ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ నూతన కార్యాలయ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన జరిగింది. జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు గద్దె రామమోహన్‌రావు, శ్రీరామ్ తాతయ్య, తంగిరాల సౌమ్యతో పాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ.. ఎన్టీఆర్ వంటి మహానుభావుడి పేరుతో ఏర్పడిన జిల్లాలో టీడీపీ జిల్లా కార్యాలయానికి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా అధ్యక్షుం—ాలు గద్దె అనురాధతో పాటు పార్టీ ముఖ్య నాయకుల సమక్షంలో కార్యక్రమం నిర్వహించడం సంతోషకర మన్నారు. మరో ఏడు, ఎనిమిది నెలల్లో కార్యాలయాన్ని పూర్తిచేసి కార్యకర్తలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో తెలుగుదేశం పార్టీకి సొంత కార్యాలయం ఉండాలన్నది పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన



కార్యదర్శి నారా లోకేష్ ఆశయమని చిన్ని తెలిపారు. పార్టీ కార్యాలయాలు కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా కార్యకర్తలకు నిరంతరం అందు బాటులో ఉండాలని, నాయకులు ప్రతిరోజూ కార్యక ర్తలతో మమేకమై పార్టీని బలోపేతం చేయాలన్నదే వారి ఉద్దేశమన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపనలు జరుగు తున్నాయని చెప్పారు. ఎపీపీఎస్సీలో అక్రమాలు జరిగాయన్న అంశంపై ప్రభుత్వం విచారణ జరిపి వివరాలను వెలుగులోకి తీసుకొచ్చిన నేపథ్యంలో అసెంబ్లీలో దీనిపై చర్చ జరగాల్సి ఉందని ఎంపీ చిన్ని అన్నారు. ఇప్పటికే కమిషన్ నివేదిక కూడా అందిందని పేర్కొన్నారు. ఈ అంశంపై చర్చను పక్కదారి పట్టించేందుకు డీఎస్సీ వ్యవహారాన్ని తెరపైకి తీసుకొచ్చారని ఆరోపించారు. డీఎస్సీ అంశాన్ని ముందుకు తీసుకొచ్చినా ఏపీపీఎస్సీపై చర్చ నుంచి తప్పించుకోలేరని అన్నారు. నారా లోకేష్, పవన్‌కల్యాణ్ కూడా ఏపీపీఎస్సీ వ్యవహారంలో వాస్తవాలను నిగ్గు తేలుస్తామని స్పష్టం చేశారని తెలిపారు. అసెంబ్లీలో ఈ అంశంపై సమగ్ర చర్చ జరగాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తమకు డీఎస్సీ ద్వారా జరిగిన న్యాయంపై స్వచ్ఛందంగా ఉద్యమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారని ఎంపీ పేర్కొన్నారు. కర్నూలులో జరిగిన కార్యక్రమాలను ప్రస్తావిస్తూ.. విజయవాడలోనూ ఉపాధ్యాయులు సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నారని విజయవాడ ఎంపీ చిన్ని తెలిపారు. ఉపాధ్యాయుల ఉద్యమాలను చూసైనా జగన్ తన వైఖరిని మార్చుకోవాలని సూచించారు. గతంలో అసెంబ్లీకి సక్రమంగా హాజరు కాలేదని, ఇప్పుడు కూడా శాసనసభకు దూరంగా ఉంటున్నారని చిన్ని విమర్శించారు. అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించకుండా బయట రాజకీయ విమర్శలు చేయడం వల్ల ప్రయోజనం లేదన్నారు. ప్రతిపక్షంగా ప్రజల తరఫున సభలో ప్రశ్నించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ఏపీపీఎస్సీ వ్యవహారంపై చర్చ జరగకుండా డీఎస్సీ అంశంతో దృష్టి మళ్లించే ప్రయత్నాలు చేస్తే ప్రజలే గమనిస్తారని చిన్ని అన్నారు. ఎన్టీఆర్ జిల్లా టీడీపీ నూతన కార్యాలయం నిర్మాణం పూర్తయిన తర్వాత జిల్లా పార్టీ కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా, కార్యకర్తలకు అందుబాటులో ఉండే వేదికగా పనిచేస్తుందని తెలిపారు.

# కరూరు తొక్కిసలాట బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు

## హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే విధింపు

న్యూఢిల్లీ,ఆగస్ట్14కరూర్ తొక్కిసలాటలో మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడాన్ని రద్దు చేస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు తాజాగా స్టే విధించింది. దీంతో, తమిళనాడు సీఎం విజయ్‌కు స్వల్ప ఊరట లభించినట్లయ్యింది. ఈ కేసులో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కే వినోద్‌లతో కూడిన ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. బాధితులకు నగదు రూపంలో సాయం చేస్తే అభ్యంతరం చెప్పే వారా? అని పిటిషనర్లను ప్రశ్నించింది. కుటుంబంలోని సంపాదన పరుడైన ఒకే ఒక వ్యక్తి మరణిస్తే కుటుంబసభ్యుల్లో ఎవరోకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి అభ్యంతరం చెబుతారా? ప్రభుత్వ విధానాన్ని ప్రశ్నించేందుకు మీరెవరు? అని ప్రశ్నించింది. గతేడాది టీవీకే ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో తొక్కిసలాటలో పలువురు మరణించిన విషయం తెలిసిందే. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టీవీకే అధినేత విజయ్ మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తూ జీవో జారీ చేశారు. అయితే, ఈ జీవోను జులై 27న హైకోర్టు కొట్టేసింది. ఆర్టికల్ 14, 15ను ప్రభుత్వ జీవో ఉల్లంఘిస్తోందని అభిప్రాయపడింది. ప్రతి ప్రభుత్వ విభాగంలో కారుణ్య నియామకాలు ఆశిస్తున్న వారు ఎందరో ఉంటారని ఈ సందర్భంగా హైకోర్టు అభిప్రాయ పడింది. వారి అవసరాలను పక్కన పెట్టి కరూర్ తొక్కిసలాట బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలు ముందుగా ఇవ్వడం సబబు కాదని పేర్కొంది. ఆర్టికల్ 162 ప్రకారం ఈ జీఓ జారీ చేశామన్న ప్రభుత్వ వాదనను సైతం కోర్టు తోసిపుచ్చింది. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అధికారాలు వినియోగించాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాల్లో ప్రభుత్వ తప్పిదాలు ఉండే అవకాశం ఉన్నప్పటికీ బాధితులకు కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగాలు



ఇవ్వని విషయాన్ని కోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఈ కేసులో కారుణ్య నియామకాలకు అనుమతిస్తే ఒక ప్రమాదకరమైన ఒరవడికి నాంది పలికినట్టు అవుతుందని హైకోర్టు అప్పట్లో పేర్కొంది.

# మంచిని చెడుగా చూపడమే వైసిపి నైజం

## ఐదేళ్లు డిఎస్సీ నిర్వహించకుండా ఏం చేశారు

## వైకాపా తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే యరపతినేని

గుంటూరు,ఆగస్ట్14 డీఎస్సీలో అక్రమాలు జరిగాయని నానాయాగీ చేసి.. మంచిని చెడుగా చూపడమే వైకాపా నైజమని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విమర్శించారు. గుంటూరు లోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు సీఎంగా ఇప్పటి వరకూ 1.96లక్షల మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలిచ్చారని తెలిపారు. ఒక్క డీఎస్సీ కూడా వేయకుండా, ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వకుండా వైకాపా ఈ విషయంపై మాట్లాడటం నిరుద్యోగుల్లో అనుమానాలు రేకెత్తించటమేనని అభిప్రాయపడ్డారు. 1994లో కాంగ్రెస్‌కు 26 సీట్లు వచ్చినా ఆ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చారని, 2019లో తెదేపాకు 23 వచ్చినా ప్రజల కోసం శాసనసభలో మాట్లాడామని గుర్తు చేశారు. జగన్ మాత్రం.. అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేశారాని ఎద్దేవా చేశారు. చంద్రబాబుని అసెంబ్లీలో అవమానించినా తట్టుకుని ప్రజల కోసం ఉన్నారని తెలిపారు. తాము వస్తే రప్పా రప్పా అంటూ వైకాపా నేతలు డైలాగులు చెబుతున్నారని... వాళ్లు మళ్లీ వచ్చేది లేదన్నారు. ఆ పార్టీ ఓ జాతీయ పార్టీలో విలీనం కావటం ఖాయమని వ్యాఖ్యానించారు. అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిపై విషం చిమ్మటం,



ఉత్తరాంధ్ర రాయలసీమల్లో పరిశ్రమలు వస్తుంటే అడ్డుకోవటం... ఇవన్నీ చూశాక జనం వైకాపాకు ఎందుకు ఓట్లు వేస్తారని ప్రశ్నించారు. రోజూ ఎక్కడ శవం దొరుకుతుందా అని వారు ఎదురు చూస్తున్నారని యరపతినేని సెటైర్లు గుప్పించారు. పరామర్శల పేరుతో వైసీపీ నేతలు వ్యవస్థలను ధ్వంసం చేసి, ప్రజలను పోలీసులను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. రప్పా రప్పా అని నరికి 11కు వచ్చారని.. ఇంకా ఏం నరుకుతారని ప్రశ్నించారు. రప్పా రప్పా అని ప్లెక్సీలు ఎందుకని యరపతినేని శ్రీనివాసరావు నిలదీశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ , లోకేశ్‌లను ఏది పడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోమని వార్నింగ్ ఇచ్చారు. దళిత మహిళా హోంమంత్రిగా ఉంటే అవమానరుస్తారా..? అని ఫైర్ అయ్యారు.

# దేశ విభజనతో ఎన్నో జీవితాలు చిన్నాభిన్నం

## పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డేపై మోడీ



న్యూఢిల్లీ,ఆగస్ట్14:దేశ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఆ విభజన కారణంగా నష్టపోయిన బాధితుల ధైర్యాన్ని ప్రధాని కొనియాడారు. ప్రతి ఏటా స్వాతంత్య్ర దినోత్సవానికి ముందు రోజున భారత ప్రభుత్వం 'పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే'ను నిర్వహిస్తోంది. దేశ విభజన, సామూహిక వలసల అనంతరం జరిగిన అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన వారికి గుర్తుగా 2021 నుంచి కేంద్రం దీనిని పాటిస్తోంది.

ఈ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసింది. ఎన్నో కుటుంబాలు చెల్లాచెదు రయ్యాయి. నాడు విభజన గాయాల బాధితులు ప్రియమైన వారిని కోల్పోయారు. అంతులేని బాధను అనుభవించారు.



## బంగారం ధరలు మళ్లీ డౌన్..

### నేడు ఎంత తగ్గాయంటే..

భారత్‌లో బంగారం ధరలు నేడు మరోసారి తగ్గాయి. అంతర్జాతీయ అనిశ్చితులకు తోడు ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు దిగడంతో నేడు భారత్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.710 మేర తగ్గింది. గురువారం కూడా పసిడి ధర రూ.1,260 మేర తగ్గిన విషయం తెలిసిందే. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు (ఆగస్టు 14) ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,52,890గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర నిన్నటితో పోలిస్తే రూ.650ల మేర తగ్గి రూ.1,40,150కు చేరుకుంది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,14,670 వద్ద కొనసాగుతోంది.

# ఎగుమతుల జోరు



న్యూఢిల్లీ: మన దేశ వస్తు ఎగుమతులు జూలైలో జోరుగా పెరిగాయి. 19.63 శాతం వృద్ధితో 4,424 కోట్ల డాలర్ల (సుమారు రూ.4.22 లక్షల కోట్లు)కు చేరుకున్నాయి. 2022 జూన్ తర్వాత ఇదే అత్యధిక వృద్ధి. అధిక దిగుమతుల కారణంగా జూలైలో వాణిజ్య లోటు ఆరు నెలల గరిష్ఠ స్థాయి 3,198 కోట్ల డాలర్ల (రూ.3.05 లక్షల కోట్లు)కు చేరుకుంది. వార్షిక ప్రాతిపదికన దిగుమతులు జూలైలో దాదాపు 17.52 శాతం పెరిగి 7,622 కోట్ల డాలర్ల (సుమారు రూ.7.27 లక్షల కోట్లు)కు చేరుకున్నాయి. ముడిచమురు దిగుమతుల్లో పెరుగుదల ఇందుకు ప్రధాన కారణం. క్రూడాయిల్ దిగుమతులు 17.64న్న పెరిగి 1,831 కోట్ల డాలర్లకు చేరినట్టు గురువారం కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ద్వారా వెల్లడైంది. మొత్తం దిగుమతుల్లో ముడిచమురు దిగుమతుల వాటాయే దాదాపు 24 శాతంగా ఉంది.

**పశ్చిమాసియాకు పెరిగిన ఎగుమతులు**

ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితులు ఉన్నప్పటికీ జూలైలో పశ్చిమాసియా దేశాలకు భారత్ ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 8.62 శాతం పెరిగి 570 కోట్ల డాలర్లకు చేరుకున్నాయని వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ పేర్కొన్నారు. గత ఏడాది ఇదే నెలలో ఈ దేశాలకు ఎగుమతులు 520 కోట్ల డాలర్లుగా ఉన్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణ నేపథ్యంలో ఈ ప్రాంతానికి మొదటిసారిగా మార్చిలో ఎగుమతులు తగ్గాయి. అయితే ఏప్రిల్, మే, జూన్‌లో మళ్లీ మెరుగుపడ్డాయి. ఈ ప్రాంతంతో వాణిజ్యం పూర్వ స్థాయిలకు చేరుకుందని అగర్వాల్ తెలిపారు. యూఏఈకి మన దేశ ఎగుమతులు 10.15 శాతం పెరిగి 330 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. సౌదీ అరేబియాకు మాత్రం వార్షిక ప్రాతిపదికన 2.73 శాతం తగ్గి 76.37 కోట్ల డాలర్లకు చేరాయి. జూలైలో ఈ రెండు దేశాల నుంచీ దిగుమతులు తగ్గాయి. అయితే ఒమన్ నుంచి మాత్రం దిగుమతులు రెండింతలకు పైగా పెరిగి 157 కోట్ల డాలర్లకు చేరాయి.

**బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ సుంకం పెంపు ప్రభావం**

బంగారం, వెండి దిగుమతులపై కస్టమ్స్ సుంకాన్ని పెంచడంతో జూలైలో ఈ రెండు విలువైన లోహాల దిగుమతులపై ప్రభావం కనిపించింది. వాణిజ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. జూలైలో బంగారం దిగుమతులు కేవలం 4.77 శాతం పెరిగి 416 కోట్ల డాలర్లకు చేరుకోగా.. వెండి దిగుమతులు ఏకంగా 66.1 శాతం తగ్గి 17.16 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. మే 13న కేంద్ర ప్రభుత్వం ఈ విలువైన లోహాలపై దిగుమతి సుంకాన్ని 6 శాతం నుంచి 15 శాతానికి పెంచిన విషయం తెలిసిందే.

**అమెరికాకు ఎగుమతుల్లో 12.85% వృద్ధి**

జూలైలో అమెరికాకు భారత్ ఎగుమతులు 12.85 శాతం పెరిగి 902 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. అలాగే చైనాకు ఎగుమతులు 64.57 శాతం వృద్ధితో 220 కోట్ల డాలర్లకు చేరినట్లు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇదే నెలలో ఈ దేశాల నుంచి దిగుమతుల్లోనూ వృద్ధి ఉన్నట్టు తెలిపింది. చైనా నుంచి దిగుమతులు 34.42 శాతం పెరిగి 1,467 కోట్ల డాలర్లకు చేరగా.. అమెరికా నుంచి 18.11 శాతం పెరిగి 550 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి.



## స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ స్పెషల్ ఆఫర్లు

80వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ వినూత్నంగా కొన్ని ఆఫర్లు తీసుకువచ్చింది. ఈ మేరకు బీఎస్ఎన్ఎల్ జ+వీ ఎం. శేషాచలం ఓ ప్రకటనలో తెలిపారు. ఫ్రీడం 2.0 ఆఫర్ కింద ఒక్క రూపాయికే సిమ్ అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ మధ్య ఓటీటీలను ప్రజలు ఎక్కువగా ఆదరిస్తున్నారని తెలిపారు. నెలకు రూ.1,111 ఫైబర్ సూపర్ ప్లస్ అందిస్తున్నామని అన్నారు. ఓటీటీ ప్లాన్ 200 వీఎజూం హై-స్పీడ్‌తో ఇంటర్నెట్ ఇస్తున్నామని.. ఈ ప్లాన్‌లో నెలకు 5000+దీ నెట్ వర్తిస్తుందని వివరించారు. 25 నుంచి 27 వారు ప్లాట్‌ఫారమ్‌లు అందిస్తామని తెలిపారు. అపరిమిత 24ఞ7 వాయిస్ కాల్స్ డ్యూయల్-బ్యాండ్ ఔఱ-ఖీఱ వాచీ రౌటర్‌ను కూడా అందిస్తామని వెల్లడించారు. బీఎస్ఎన్ఎల్ శాటిలైట్ ఫోన్‌ను కూడా రీ లాంచ్ చేశామని ప్రకటించారు.

లక్ష రూపాయల్లో ఐ ఫోన్ తీసుకుంటే.... అది సిమ్ లేకుండా పనిచేయదని బీఎస్ఎన్ఎల్ జ+వీ అన్నారు. అదే ఖర్చుతో శాటిలైట్ ఫోన్ తీసుకుంటే సిమ్‌తో వస్తుందని... దేశంలో ఎక్కడైనా ఇది పనిచేస్తుందని తెలిపారు. ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా పూర్తి స్వదేశీ సాంకేతికతతో 4జీ సేవలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. దేశ వ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్‌కు లక్ష సిగ్నల్ టవర్లు ఉన్నాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో బీఎస్ఎన్ఎల్‌కు 6850 టవర్లు ఉన్నాయని తెలిపారు. బీఎస్ఎన్ఎల్ ఇకపై టెలికాం సేవలతో పాటు హార్డ్‌వేర్ సేవలను సైతం అందిస్తుందని చెప్పుకొచ్చారు.

గత ఏడాది రూ.24 వేల కోట్ల ఆదాయం..

## స్వైన్ ఫ్లూ, జలుబు.. రెండూ ఒకేలా అనిపించినా, వేర్వేరు.. తేడాలేమిటి, ఏం జాగ్రత్తలు తీసుకోవాలి..?



హెచ్1ఎన్1 లేదా స్వైన్ ఫ్లూ లక్షణాలు చాలాసార్లు సాధారణ జలుబు లక్షణాల మాదిరిగానే కనిపిస్తాయి. అయితే రెండు ఇన్ఫెక్షన్ల మధ్య కొన్ని ముఖ్యమైన తేడాలు ఉన్నాయి. ముఖ్యంగా అకస్మాత్తుగా అధిక జ్వరం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, చలి, తలనొప్పి, విపరీతమైన నీరసం వంటి లక్షణాలు ఒకేసారి కనిపిస్తే హెచ్1ఎన్1 ఇన్ఫెక్షన్‌ను నిర్లక్ష్యం చేయకూడదు. ప్రారంభ లక్షణాలను గుర్తించడం ద్వారా అవసరమైన వైద్య సహాయం సకాలంలో పొందే అవకాశం ఉంటుంది. హెచ్1ఎన్1 అంటే ఇన్ఫ్లుయెంజా ఎ వైరస్‌కు చెందిన ఒక రకం. ఇది ముక్కు, గొంతు, కొన్నిసార్లు ఊపిరితిత్తులను ప్రభావితం చేసే అంటువ్యాధి. ఇది సోకిన వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, మాట్లాడినప్పుడు లేదా సమీపంలో శ్వాస తీసుకున్నప్పుడు వెలువడే శ్వాసకణాల ద్వారా ఇది ఇతరులకు వ్యాపిస్తుంది. 2009లో ప్రపంచవ్యాప్తంగా వ్యాపించిన ఇన్ఫ్లుయెంజా మహమ్మారి సమయంలో హెచ్1ఎన్1 వైరస్‌పై పెద్ద ఎత్తున దృష్టి నిలిచింది.

**అకస్మాత్తుగా జ్వరం వస్తే..**

హెచ్1ఎన్1 ఇన్ఫెక్షన్ తొలి రోజున సాధారణంగా అకస్మాత్తుగా జ్వరం రావడం ముఖ్యమైన సంకేతంగా కనిపిస్తుంది. శరీర ఉష్ణోగ్రత సాధారణంగా 100 డిగ్రీల ఫారెన్‌హీట్ లేదా 37.8 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా ఉంటుంది. జ్వరంతోపాటు తీవ్రమైన ఒళ్లు నొప్పులు, చలి, వణుకు, తలనొప్పి, విపరీతమైన నీరసం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. సాధారణ జలుబుతో పోలిస్తే హెచ్1ఎన్1లో ఒళ్లు నొప్పులు ఎక్కువగా తీవ్రంగా ఉండే అవకాశం ఉంటుంది. కండరాల్లో నొప్పి, శరీరం మొత్తం బలహీనంగా అనిపించడం, రోజువారీ పనులు చేయడానికి కూడా శక్తి లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. అకస్మాత్తుగా జ్వరంతోపాటు చలి, వణుకు, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, తలనొప్పి, విపరీతమైన అలసట కనిపిస్తే కూడా అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి లక్షణాలు ఒకదానితో ఒకటి కలసి కనిపిస్తే వైద్యుల సలహా తీసుకోవడం అవసరం.

**నిరంతరం తలనొప్పి..**

కొంతమందిలో నిరంతరంగా ఉండే తలనొప్పి కూడా హెచ్1ఎన్1కు సంబంధించిన లక్షణంగా కనిపిస్తుంది. అయితే ఒక్క తలనొప్పి ఆధారంగా హెచ్1ఎన్1 ను నిర్ధారించలేమని, ఇతర లక్షణాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని గుర్తుంచుకోవాలి. హెచ్1ఎన్1 శ్వాసకోశ వ్యవస్థను ప్రభావితం చేయడం వల్ల పొడి దగ్గు వస్తుంది. గొంతు, శ్వాసనాళాల్లో కలిగే వాపు లేదా చికాకు కారణంగా పొడి, పదేపదే వచ్చే దగ్గు కొన్ని రోజులు లేదా వారాల పాటు కొనసాగుతుంది. ఈ ఇన్ఫెక్షన్‌లో విపరీతమైన అలసట కూడా కనిపిస్తుంది. సాధారణ జలుబులో ఉండే స్వల్ప అలసటతో పోలిస్తే వ్యతిరేకంగా జరిగే బలమైన రోగనిరోధక ప్రతిస్పందన కారణంగా బలహీనత, ఎక్కువ విశ్రాంతి తీసుకోవాలనిపించడం వంటి సమస్యలు వస్తాయి. హెచ్1ఎన్1, సాధారణ జలుబు మధ్య కొన్ని తేడాలను గమనించవచ్చు.



## దేశంలో పెరుగుతున్న ఫ్యాటీ లివర్ సమస్య..

**చిన్నారుల్లోనూ పెరుగుతున్న ముప్పు..**

దేశంలో ఫ్యాటీ లివర్ సమస్యను గతంలో ప్రధానంగా అధిక మద్యం సేవించే వారిలో కనిపించే వ్యాధిగా భావించేవారు. అయితే ఇప్పుడు పరిస్థితి మారుతోంది. ఊబకాయం, మధుమేహం, రక్తపోటు, శారీరక శ్రమ లేకపోవడం వంటి జీవక్రియ సంబంధిత సమస్యల కారణంగా మద్యం తీసుకోని వారిలోనూ ఫ్యాటీ లివర్ కేసులు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిని ప్రస్తుతం మెటబాలిక్ డిస్‌ఫంక్షన్-అసోసియేటెడ్ స్టియాటోటిక్ లివర్ డిసీజ్ (హీూూాణ) అని పిలుస్తున్నారు. ఇటీవలి జాతీయ, అంతర్జాతీయ అధ్యయనాల సమీక్ష ప్రకారం భారతదేశ జనాభాలో సుమారు 16 నుంచి 32 శాతం మంది ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతున్నట్లు అంచనా. అంటే దాదాపు 12 కోట్ల మందికి ఈ సమస్య ఉండే అవకాశం ఉంది. వ్యాధి ఎక్కువగా ఎలాంటి లక్షణాలు లేకుండానే కొనసాగుతుండటంతో చాలామందికి తమకు ఫ్యాటీ లివర్ ఉందనే విషయం కూడా తెలియడం లేదని నిపుణులు చెబుతున్నారు. అందుకే ముందస్తు పరీక్షలు, నిర్ధారణ, జీవనశైలిలో మార్పులు అవసరమవుతున్నాయి.

**ఆందోళన కలిగిస్తున్న విషయాలు..**

26 వేల మందికి పైగా పాల్గొన్న 50 అధ్యయనాల సమగ్ర విశ్లేషణలో కూడా ఆందోళన కలిగించే విషయాలు వెల్లడయ్యాయి. భారతీయ పెద్దల్లో సుమారు 38.6 శాతం మందికి గతంలో నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ (చీూఖీూణ)గా పిలిచే సమస్య ఉన్నట్లు అంచనా వేశారు. ముఖ్యంగా ఊబకాయం లేదా టైప్-2 మధుమేహం వంటి మెటబాలిక్ సమస్యలు ఉన్నవారిలో ఈ సంఖ్య 52.8 శాతానికి చేరింది. అంటే ఈ అధిక ప్రమాదం ఉన్న వర్గాల్లో ప్రతి ఇద్దరిలో ఒకరికి పైగా ఫ్యాటీ లివర్ ఉండే అవకాశం ఉందని విశ్లేషణ సూచిస్తోంది. ఈ సమస్య పెద్దలకు మాత్రమే పరిమితం కావడం లేదు. పిల్లల్లో కూడా ఫ్యాటీ లివర్ కేసులు పెరుగుతున్నాయి. మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గడం, చిన్న వయసులోనే ఊబకాయం పెరగడం ఇందుకు ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. పిల్లల్లో ఫ్యాటీ లివర్ వ్యాధి సగటు ప్రాబల్యం 35.4 శాతంగా ఉండగా, ఊబకాయం ఉన్న పిల్లల్లో ఇది ఏకంగా 63.4 శాతానికి పెరిగినట్లు విశ్లేషణ వెల్లడించింది.ప్రమాదాన్ని పెంచుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బరువు తగ్గాలని ప్రయత్నించే చాలామంది సాధారణ శీతల పానీయాలకు బదులుగా షుగర్-ఫ్రీ లేదా డైట్ సోడాలను ఎంచుకుంటారు. క్యాలరీలు తక్కువగా ఉంటాయి కాబట్టి ఇవి బరువు తగ్గేందుకు సహాయపడతాయని చాలామంది భావిస్తారు. అయితే కేవలం క్యాలరీలను తగ్గించడం మాత్రమే బరువు నియంత్రణకు సరిపోదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా తరచూ డైట్ డ్రింక్స్ తీసుకున్నప్పటికీ పొట్ట చుట్టూ కొవ్వు తగ్గకపోవడం లేదా సాయంత్రం సమయంలో తీపి పదార్థాలపై కోరిక పెరగడం వంటి సమస్యలు ఉంటే ఆహారపు అలవాట్లను మరోసారి పరిశీలించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. షుగర్-ఫ్రీ డ్రింక్స్‌లో సాధారణ చక్కెరకు బదులుగా కృత్రిమ స్వీటెనర్లను ఉపయోగిస్తారు. ఇవి క్యాలరీలను తగ్గించినప్పటికీ, మెదడుకు తీపి రుచి అందడం వల్ల గ్లూకోజ్ వస్తుందని ఆశించే పరిస్థితి ఏర్పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ఆశించిన గ్లూకోజ్ అందకపోతే కొంతమందిలో తీపి పదార్థాలపై కోరిక మరింత పెరుగుతుంది. ఫలితంగా ఇతర ఆహారాలను ఎక్కువగా తినే అవకాశం ఉంటుంది.

**పేగు బ్యాక్టీరియాపై ప్రభావం..**

అస్పార్టేమ్, సుక్రలోజ్ వంటి కృత్రిమ స్వీటెనర్లు ఆరోగ్యకరమైన పేగు బ్యాక్టీరియాపై ప్రతికూల ప్రభావం చూపిస్తాయి. పేగు ఆరోగ్యంలో మార్పులు శరీరంలోని వాపు, బరువు నియంత్రణ వంటి అంశాలతో సంబంధం కలిగి ఉంటాయి. అయితే ఈ అంశాలపై వ్యక్తుల మధ్య ప్రభావం భిన్నంగా ఉంటుంది. డైట్ సోడాలు, ఎనర్జీ డ్రింక్స్‌కు బదులుగా మన దేశంలో సులభంగా లభించే సహజ పదార్థాలతో తయారయ్యే పానీయాలను ఎంచుకోవాలి. వీటిలో సత్తు షర్బత్, మసాలా మజ్జిగ, పుదీనా నిమ్మరసం, తాజా కొబ్బరి నీరు వంటి పానీయాలు ఉన్నాయి. సత్తు షర్బత్‌లో మొక్కల ఆధారిత ప్రోటీన్, ఫైబర్ ఉంటాయి. ఇవి ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగించడంలో సహాయపడతాయి.తీసుకునే సత్తు షర్బత్‌కు బదులుగా డైట్ సోడాను ఎంచుకునే అలవాటును మార్చుకోవచ్చు. మసాలా మజ్జిగలో సహజ ప్రోబయోటిక్స్ ఉంటాయి. ఇవి పేగు ఆరోగ్యానికి మద్దతు ఇస్తాయి. మధ్యాహ్నం తర్వాత పొట్ట మంచి ప్రత్యామ్నాయంగా ఉంటుంది.

## షుగర్ ఫ్రీ లేదా డైట్ సోడాలను తాగవచ్చా..



# ఓ కుటుంబ కథా చిత్రమ్...

## విశ్వనాథ్ అండ్ సన్స్




కొన్నేళ్లుగా కుటుంబ కథలు అరుదుగా తెరకెక్కుతున్నాయి. అగ్ర కథానాయకులైతే అటువైపు దృష్టిపెట్టడమే మానేశారు. ఈమధ్యే మళ్లీ ఆ కథలకు పూర్వ వైభవం వస్తున్నట్టు అనిపిస్తోంది. పలువురు యువ దర్శకులు కుటుంబ కథలపై మళ్లీ దృష్టిపెడుతున్నారు. దర్శకుడు వెంకీ అట్లూరి తమిళ కథానాయకుడు సూర్యతో 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమా ద్వారా అదే ప్రయత్నం చేశారు. సంజయ్ విశ్వనాథ్ (సూర్య) ఓ సంపన్న కుటుంబానికి చెందిన వారసుడు. పేరున్న వ్యాపారవేత్త అయినా, 40 ఏళ్లు వచ్చినా వివాహం చేసుకోడు. తల్లి (రాధిక శరత్‌కుమార్) మాత్రం పెళ్లి చేసుకోవాలని, వారసుడిని కని ఇవ్వాలని పోరు పెడుతుంటుంది. దాంతో అమెరికా వెళ్లి సరోగసి ద్వారా ఓ బాబుని కని ఇంటికి తీసుకొస్తాడు. కానీ ఊహించని రీతిలో ఆ చిన్నారి అనారోగ్యానికి గురవుతాడు. చికిత్స చేసే క్రమంలో ఆ చిన్నారికి కన్నతల్లి అవసరం ఏర్పడుతుంది. దాంతో ఆమెని వెతుక్కుంటూ మళ్లీ అమెరికా వెళతాడు సంజయ్ విశ్వనాథ్. మరి తన బాబుకు జన్మనిచ్చిన తల్లి దొరికిందా? ఇంతకీ ఆమె ఎవరు? అమెరికా నుంచి ఇండియాకి రావడానికి అంగీకరిస్తుందా? లేదా? సంజయ్ పెళ్లి విషయంలో తన తల్లి కోరికని నెరవేర్చాడా?

సంజయ్ జీవితంలో మదన కామేశ్వరి అలియాస్ మ్యాడీ (మమిత బైజు) ఎలా వచ్చింది? తదితర విషయాలన్నీ హృద్యంగా చిత్రీకరించారు. ఇంటిల్లిపాదీ కలిసి ఆస్వాదించే స్వచ్ఛమైన వినోదం, భావోద్వేగాలున్న సినిమా ఇది.

హృదయాల్ని హత్తుకునే ఓ కుటుంబ కథని తెరపైకి తీసుకొచ్చారు వెంకీ అట్లూరి. తన శైలి క్లాస్, పరిణతితో కూడిన రచనతో సూర్యలోని క్లాస్ నటుడిని ఆవిష్కరించిన తీరు ఈ సినిమాకి హైలైట్. హీరో హీరోయిన్ల మధ్య వయసు తేడా, సరోగసీ ద్వారా కన్న బిడ్డతో ముడిపడిన భావోద్వేగాలు ఈ కథకు కొత్తదనం తీసుకొచ్చాయి. సంజయ్ – మ్యాడీ కలిసినప్పటి నుంచి సినిమాలో సందడే సందడి. ముఖ్యంగా సంజయ్ తల్లితో కలిసి మ్యాడీ చేసే అల్లరి చాలా బాగుంటుంది. కొన్ని సున్నితమైన సన్నివేశాల్ని దర్శకుడు డీల్ చేసిన తీరు చాలా బాగుంటుంది. సూర్య, మ్యాడీ బంధం ఏ తీరానికి చేరుతుందన్న ఆసక్తిని రేకెత్తిస్తూ ద్వితీయార్ధం మొదలవుతుంది. అయితే, కోర్ట్ సన్నివేశాలు, ఆ తర్వాత చోటు చేసుకునే నాటకీయ పరిణామాలతో వచ్చే సీన్లు పెద్దగా ఆకట్టుకోకపోగా కథ అక్కడక్కడే తిరుగుతున్నట్టు అనిపిస్తుంది. అంతలోనే రాధిక పాత్ర నేపథ్యంలో వచ్చే మలుపుతో కథ అనూహ్యంగా మరో దారిని తీసుకుంటుంది. దాంతో సినిమా కాస్త పక్కదారి పట్టినట్లు అనిపిస్తుంది. అంజలీదేవి (రవీనా టాండన్), ఆమె కూతురు, తల్లిదండ్రులతో ముడిపడిన సన్నివేశాల్లో కొన్ని భావోద్వేగాలు, నాజర్ పాత్రతో కొంత హాస్యం పండటం సినిమాకి కలిసొస్తుంది. ఈ కథకు ముగింపు కూడా క్లాస్‌గానే ఉంటుంది. ఇలాంటి కథలకు ఇదే సరైన ముగింపు అనిపిస్తుంది కానీ, మరింత హంగామా కోరుకునేవాళ్లకు అది సంతృప్తిని ఇవ్వకపోవచ్చు. సూర్యలోని క్లాస్ నటుడిని పూర్తిగా వాడుకున్న సినిమా ఇది. ఆయన పండించిన భావోద్వేగాలు సినిమాకి హైలైట్. మ్యాడీగా మమిత బైజు నటన ఈ సినిమాకి ప్రధాన ఆకర్షణ. జీవీ ప్రకాశ్‌కుమార్ పాటలు, నేపథ్య సంగీతం సినిమాకి బలం. విజువల్స్ ఆకట్టుకుంటాయి. దర్శకుడు వెంకీ రచన, మాటలు చాలా బాగున్నాయి.

# 16న ఇరుముడి ప్రీరిలీజ్ వేడుక




మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. కాగా, ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఆగస్టు 16న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక వేదికగా 'ఇరుముడి' ప్రీ రిలీజ్ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మల్లెపూల పల్లకి' పాటను విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటూ యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంలో ప్రియా భవాని శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది.

# అతీంద్రియ శక్తుల హర్రర్ స్టోరీ అగధ




ఈ వారం వరుస చిత్రాలు బాక్సాఫీస్‌కు క్యూ కట్టాయి. వాటిలో 'అగధ' ఒకటి. చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని కోల్పోయిన ఓ యువతి మహాదేవి (కామాక్షి భాస్కర్ల). బాబాయ్ (భానుచందర్) దగ్గర వాళ్ల పిల్లలతో కలిసే పెరుగుతుంది. అనుకోకుండా ఓ రోజు ఓ దైవ శక్తి కనిపించి ఆమెను ఓ కొత్త మార్గంలో నడిపిస్తుంది. అప్పట్నుంచి ఆ శక్తి చెంతనే గడుపుతూ పెరిగి పెద్దదవుతుంది. అక్కడికి ఓ సాధువు వచ్చి కొన్ని యంత్ర, తంత్ర విద్యల్ని నేర్పించి, వాటిని ప్రజల మంచి కోసం ఉపయోగించాలని కోరతాడు. అప్పట్నుంచి ప్రజల్ని వేధించే అతీత శక్తుల నుంచి కాపాడుతూ పేరు సంపాదిస్తుంది. అందుకే ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో మహాదేవి అంటే ఎంతో పేరు. అలాంటి మహాదేవిని పెంచిన బాబాయ్ కుటుంబానికి అగధ అనే అతీత శక్తి నుంచి ముప్పు ఏర్పడుతుంది. గర్భంతో ఉన్న బాబాయ్ కూతురు ఆత్మహత్య చేసుకుంటుంది. ఆమెతోపాటు మరిన్ని మరణాలూ చోటు చేసుకుంటాయి. దాంతో తన కుటుంబాన్ని కాపాడుకోవడానికని సొంతూరికి వెళ్లాక అక్కడ మహాదేవికి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి?ఇంతకీ అగధ ఎవరు?మహాదేవి కుటుంబాన్నే లక్ష్యంగా చేసుకోవడానికి కారణమేమిటి?దైవిక శక్తుల అండ ఉన్న మహాదేవికీ, అగధకీ మధ్య పోరాటం ఎలా సాగింది?ఎవరు గెలిచారన్నది చిత్ర కథ. చాలా రోజుల తర్వాత కేవలం భయాన్ని, థ్రిల్‌ని పంచడమే లక్ష్యంగా రూపొందిన సినిమానే... 'అగధ'. థ్రిల్లర్ సినిమాలకి తగ్గ వేగం ఇందులో కొరవడినా... ఆసక్తిని రేకెత్తించే కథా ప్రపంచం తోనూ, గాఢతతో కూడిన సన్నివేశాలతోనూ సినిమా చాలావరకూ లక్ష్యాన్ని అందుకుందీ చిత్రం.

# విశ్రాంతిని ఎంజాయ్ చేస్తున్న రష్మిక



టాలీవుడ్ ప్రముఖ నటి రష్మికా మందన్నా ప్రస్తుతం గాయం కారణంగా సినిమాలకు దూరంగా ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ రెస్ట్ సమయంలో తన ఆలోచనల్లో వచ్చిన మార్పుల గురించి ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న ఒక పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.

ఎప్పుడూ తీరిక లేకుండా ఉరుకులు పరుగులతో బిజీగా గడిపేవారికి, ఒక్కసారిగా పనులు ఆపేసి విశ్రాంతి తీసుకోవడం మొదట్లో చాలా భయంగా అనిపిస్తుందని రష్మిక తెలిపారు. అయితే, తప్పనిసరి పరిస్థితుల్లో అలా విశ్రాంతి తీసుకోవాల్సి వస్తే.. గతంలో అలా పిచ్చివాళ్లలా పనుల వెనకే పరిగెత్తిన దినాలు ఇప్పుడు తలచుకుంటే మరింత భయంగా అనిపిస్తాయని, బహుశా జీవితం అంటే ఇదేమో అని ఆమె పేర్కొన్నారు. ఎలాంటి అలారాలు పెట్టుకోకుండా శరీరం కోరిన సమయానికి లేవడం, రోజుకు రెండు పూటల మితంగా భోజనం చేయడం, తన పెంపుడు కుక్క 'ఆరా'తో సమయం గడపడం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పుస్తకాలు చదవడం, పజిల్స్ చేయడం, ఇష్టమైన షోలు చూడటంతో పాటు పాత ఫోటోలు, వీడియోలను నెమరువేసుకుంటూ ప్రశాంతంగా గడుపుతున్నానని చెప్పారు. ఈ కష్టకాలంలో తాను త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ అభిమానులు, శ్రేయోభిలాషులు పంపిస్తున్న ప్రార్థనలకు, చూపుతున్న ప్రేమానురాగాలకు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో వస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' చిత్ర షూటింగ్‌లో భాగంగా ఒక డ్యాన్స్ సీక్వెన్స్ చేస్తుండగా రష్మిక తుంటి భాగంలో గాయమైంది. వైద్యుల సూచన మేరకు ఆమె కొన్ని వారాల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి రావడంతో ప్రస్తుతం పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారు.

# టాక్సిస్ కోసం కియారా చాలా కష్టపడింది




నటుడు యశ్ ప్రశంసలు సినీ ప్రియులు ఎంతో ఎదురుచూస్తోన్న 'టాక్సిక్' మరికొన్నిరోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది . తాజాగా ఈ సినిమా ఆడియో లాంచ్ ఈవెంట్‌ను ముంబయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్ మాట్లాడుతూ.. కియారపై మరోసారి ప్రశంసలు కురిపించారు. కియార నిబద్ధత ఉన్న నటి. ఆమె ఈ సినిమా షూటింగ్‌కు వచ్చినప్పుడు నేను కొంచెం ఆందోళన పడ్డాను. ఎందుకంటే ఈ పాత్ర చాలా కఠినంగా ఉంటుంది. వర్షంలో తడిసే ఓ సన్నివేశం సులభంగా అయిపోతుందని అనుకున్నాం. కానీ, దానికి చాలా సమయం పట్టింది. ఆమె చాలా కష్టపడింది. ఆమె ప్రెగ్నెంట్ అని తెలిసిన తర్వాత కూడా అంతే అంకిత భావంతో సెట్స్‌కు వచ్చింది. నాతో పాటు గీతూ మోహన్‌దాస్ కూడా చాలా టెన్షన్ పడింది. మేమిద్దరం సెట్‌లో కియారకు బౌన్సర్లు, బాడీగార్డ్‌లుగా మారి జాగ్రత్తగా చూసుకున్నాం. ఆమె పడ్డ కష్టానికి తగిన గుర్తింపు కచ్చితంగా వస్తుంది.